SRAVANTHI
ENTER PRISES
Offset Printers
1-9-18/A,Opposite sadhana college Ramnagar
,Hyderabad-500 020. T.S.
Cell: 9848384973

TELTEL/2014/56075

# తహెల్కా న్యూస్

తెలుగు దినపత్రిక హైదరాబాద్

TAHELKA NEWS TELUGU DAILY

చదవండి!!! చదివించండి!!!
సెన్సేషనల్ క్రైమ్
మాసపత్రిక
9490617493

సంపుటి:10 సంచిక:96 హైదరాబాద్ ఎడిటర్:దొడ్డమని బసవరాజ్ 16.03.2024 శనివారం పేజీలు:4 రూ.1/

## మల్కాజిగిరి లోక్‌సభ స్థానం పరిధిలో ఏర్పాటు చేసిన రోడ్‌షోలో పాల్గొన్నా ప్రధాని నరేంద్ర మోదీ



మల్కాజిగిరి, మార్చి 15(భారత్ సమాచార్)ప్రధాని నరేంద్ర మోదీ లోక్‌సభ ఎన్నికల మలివిడత ప్రచారంలో భాగంగా రాష్ట్రంలో పర్యటించారు . బీజేపీ విజయాన్ని కాంక్షిస్తూ ఇవాళ మల్కాజిగిరి లోక్‌సభ స్థానం పరిధిలో ఏర్పాటు చేసిన రోడ్‌షోలో పాల్గొన్నారు. మీర్జాలగూడ నుంచి మల్కాజిగిరి క్రాస్ వరకు దాదాపు 1.2 కిలోమీటర్ల మేర సాగిన ర్యాలీలో, అశేష జనవాహిని స్వాగతం పలికింది. దీంతో రోడ్లన్నీ కాషాయమయంగా మారాయి.రాష్ట్రంలో లోక్ సభ ఎన్నికల ప్రచారంలో బీజేపీ దూకుడు పెంచింది. అత్యధిక స్థానాలు కైవసం చేసుకోవడమే లక్ష్యంగా అగ్రనేతలు ప్రచారబరిలోకి దిగారు. పదిరోజుల వ్యవధిలోనే తెలంగాణలో మరోసారి అడుగుపెట్టిన ప్రధాని మోదీ, నుంచి మూడురోజుల పాటు ఎన్నికల ప్రచారం మొదలైంది. పార్లమెంట్? ఎన్నికల మలివిడత ప్రచారంలో భాగంగా రాష్ట్రానికి విచ్చేసిన మోదీకి పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. ఇటీవల మరికొంతమంది బీజేపీ పార్లమెంట్ అభ్యర్థులను ఆ పార్టీ ప్రకటించిన నేపథ్యంలో పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.మల్కాజిగిరి రోడ్?షోలో పాల్గొన్న ప్రధాని కాషాయమయమైన రహదారులుబీజేపీ రెండో జాబితా విడుదల – తెలంగాణ నుంచి ఆరుగురి పేర్లు ఖరారురాష్ట్ర పర్యటన నిమిత్తం కేరళ నుంచి ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న ప్రధాని, అక్కడ నుంచి నేరుగా రోడ్డు మార్గంలో మల్కాజిగిరి చేరుకున్నారు. నియోజకవర్గ పరిధిలో బీజేపీ విజయాన్ని కాంక్షిస్తూ మోదీ రోడ్?షో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కేంద్రమంత్రి కిషన్?రెడ్డి, ఎంపీ అభ్యర్థి ఈటల రాజేటందర్? సహా పలువురు బీజేపీ నేతలు పాల్గొన్నారు. మీర్జాలగూడ నుంచి మల్కాజిగిరి క్రాస్ వరకు దాదాపు 1.2 కిలోమీటర్ల మేర సాగిన భారీ ర్యాలీలో పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, ప్రజలు హాజరయ్యారు. అశేష జనవాహినితో రోడ్లన్నీ కాషాయమయంగా మారాయి. దీంతో సర్వత్రా మోదీ నామజపంతో మల్కాజిగిరి ఒక్కసారిగా మార్మోగింది.రోడ్?షో అనంతరం రాజ్?భవన్?కు ప్రధాని పయనమయ్యారు. కాగా శనివారం నాగర్‌కర్నూల్‌లో జరగనున్న బహిరంగ సభకు ప్రధాని పాల్గొంటారు. ఇది నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నల్గొండ పార్లమెంట్? స్థానాలు లక్ష్యంగా జరగనుంది. అలాగే ఈ నెల 18న ప్రధాని జగిత్యాల బహిరంగ సభలో పాల్గొంటారు. కరీంనగర్, నిజామాబాద్, పెద్దపల్లి ఎంపీ స్థానాలే లక్ష్యంగా దానికి రూపకల్పన చేశారు.ఇప్పటికే ఈ నెల 4, 5 తేదీల్లో రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల తొలివిడత ప్రచారం నిర్వహించారు. ఆదిలాబాద్, పటాన్‌చెరు బీజేపీ విజయ సంకల్ప సభల్లో పాల్గొన్నారు. అలాగే బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఒక రోజు హైదరాబాద్‌లో వివిధ కార్యక్రమాల్లో పాల్గొని పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు

## సీఎం రేవంత్ రెడ్డి ని కలిసిన బిఆర్ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్



హైదరాబాద్, మార్చి 15(భారత్ సమాచార్) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఖైరతాబాద్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ శుక్రవారం కలిశారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో కలుసుకున్నారు. భేటీ కార్యక్రమంలో ఏఐసీసీ ఇంచార్జ్ దీపాదాస్ మున్షీ, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఏఐసీసీ ఇన్?ఛార్జి కార్యదర్శులు రోహిత్ చౌదరీ, విష్ణునాథ్, మన్సూర్ అలీఖాన్, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షులు రోహిన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్? గూటికి చేరువయ్యేనా? : గత కొన్ని రోజులుగా ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్ రెడ్డి, దానం అనుచరులతో టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్‌లోకి వచ్చేందుకు సుముఖంగా ఉన్నట్లు తెలుసుకున్న తరువాతనే ఇవాళ సీఎంను కలిసేందుకు అవకాశం ఇచ్చినట్లు సమాచారం. ముఖ్యమైన నాయకులను పీసీసీ అధ్యక్షుడి హెూదాలో సీఎం రేవంత్ రెడ్డి కలిసే సమయంలో అవకాశం ఉన్న మేరకు సీనియర్లను కూడా కలుపుకుని పోవాలని ఏఐసీసీ సూచించినట్లు తెలుస్తోంది.ఖమ్మం లోక్?సభ సీటు కోసం టఫ్ ఫైట్ – విశ్వప్రయత్నాలు చేస్తున్న నేతలుమరోవైపు చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ రంజిత్ రెడ్డి కూడా సీఎంని కలిసే అవకాశం ఉందని కాంగ్రెస్ పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. శుక్రవారం సాయంత్రం కాని శనివారం సమావేశం జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. అదేవిధంగా రానున్న రెండు మూడు రోజుల్లో పలువురు కార్పొరేటర్లు కూడా కాంగ్రెస్ కండువా కప్పుకునే అవకాశం ఉన్నట్లు పీసీసీ వర్గాలు చెబుతున్నాయి.లోక్?సభ ఎన్నికల వేళ బీఆర్?ఎస్? పార్టీలో రాజకీయ వలసలు రాజుకుంటున్నాయి. ఓవైపు అధికార పక్షం కాంగ్రెస్, మరోవైపు బీజేపీలోకి కీలక నేతలు వలసలు వెళ్తున్నారు. తాజాగా కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా? అధ్యక్షుడు సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప హస్తం గూటికి చేరారు. శాసనసభ్యుడుగా ఓడిపోయిన తాను నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్?లో చేరినట్లు తెలిపారు.

## ఢిల్లీ మద్యం కుంభకోణం కేసు – బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఇంట్లో ఈడీ, ఐటీ సోదాలు



హైదరాబాద్, మార్చి 15(భారత్ సమాచార్) ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత నివాసంలో ఈడీ, ఐటీ అధికారులు సంయుక్తంగా సోదాలు నిర్వహించారు. బంజారాహిల్స్‌లోని ఆమె నివాసంలో ఎన్?ఫోర్స్?మెంట్ డైరెక్టరేట్ జాయింట్ డైరెక్టర్ ఆధ్వర్యంలో ఇద్దరు మహిళా అధికారులు సహా 8 మంది అధికారుల బృందం, ఐటీ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేశారు. సోదాల సందర్భంగా ఇంట్లో ఉన్న అందరి వద్ద సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్న ఈడీ అధికారులు, పలు డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. కవిత వాంగ్మూలం నమోదు చేశారు. అంతకుముందు దాడుల నేపథ్యంలో బీఆర్ఎస్ లీగల్ కన్వీనర్ సోమ భరత్, లాయర్లు కవిత నివాసానికి చేరుకోగా, అధికారులు ఆమె ఇంట్లోకి ఎవరినీ అనుమతించ లేదు. మరోవైపు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కవిత నివాసం వద్ద పోలీసులు భారీగా మోహరించారు.దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో విచారణకు రావాల్సిందిగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ గతంలో జారీ చేసిన నోటీసులను సవాల్ చేస్తూ ఎమ్మెల్సీ కవిత సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. మహిళల విచారణలో సీఆర్పీసీ నిబంధనలు పాటించడం లేదని ఆరోపిస్తూ కవిత సుప్రీంలో పిటిషన్ దాఖలు చేశారు. తనపై ఈడీ ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఆదేశాలివ్వాలని అందులో కోరారు. ఈ పిటిషన్‌పై సర్వోన్నత న్యాయస్థానం ఇప్పటికే పలుమార్లు విచారించింది. నేడూ విచారణకు రాగా, ఈ నెల 19వ తేదీకి వాయిదా వేసింది. ఇంతలోనే ఈడీ, ఐటీ అధికారులు సంయుక్తంగా దాడులు చేయడం గమనార్హం.ముఖ్య నేతలతో కేసీఆర్ భేటీ : ఇదిలా ఉండగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో ఆ పార్టీ ముఖ్యనేతలు సమావేశమ య్యారు. కేటీఆర్, హరీశ్‌రావు, సంతోశ్?కుమార్, ప్రశాంత్ రెడ్డిలు ఆయనతో భేటీ అయ్యారు. కవిత ఇంట్లో ఈడీ, ఐటీ అధికారుల సోదాల నేపథ్యంలో వీరి భేటీకి ప్రాధాన్యం సంతరించుకుంది.

## నేడు లోకసభ ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చెయ్యనున్నట్లు గా ప్రకటించిన ఈసీ ఏపీ, ఒడిశా, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు కూడా షెడ్యూల్




న్యూఢిల్లీ, మార్చి 15(భారత్ సమాచార్)దేశమంతా ఎప్పుడెప్పుడా అని ఆసక్తిగా ఎదురు చూస్తున్న సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముహూర్తం ఖరారైంది. కేంద్ర ఎన్నికల సంఘం శనివారం ఎన్నికల తేదీలను ప్రకటించనుంది. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా వెల్లడించింది. శనివారం మధ్యాహ్నం 3గంటలకు నిర్వహించే మీడియా సమావేశంలో లోక్‌సభ ఎన్నికలు, కొన్ని రాష్ట్రాల శాసనసభ ఎన్నికల తేదీలను ప్రకటించనున్నట్లు ఈసీ తెలిపింది. లోక్‌సభతోపాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం శాసనసభల ఎన్నికల తేదీలను ప్రకటించే అవకాశం ఉంది. అయితే జమ్ముకశ్మీర్ శాసనసభ ఎన్నికల తేదీలు ప్రకటిస్తారా లేదా అనే విషయమై స్పష్టత లేదు.ప్రస్తుత లోక్‌సభ గడువు జూన్ 16న ముగియ నుంది. అప్పటిలోగా కొత్త సభ ఏర్పాటు కావాల్సి ఉంది. దీంతో పాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, సిక్కిం, అరుణాచల్‌ప్రదేశ్ అసెంబ్లీలకు ఈ ఏడాది మేలోగా ఎన్నికలు జరగాల్సి ఉంది. ఇందుకోసం ఇటీవల దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో పర్యటించిన ఈసీ, స్థానిక రాజకీయ పార్టీలు, క్షేత్రస్థాయిలో అధికారులతో విస్తృత సమావేశాలు జరిపి షెడ్యూల్‌ను సిద్ధం చేసింది. గత లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ 2019 మార్చి 10న విడుదలైంది. ఏప్రిల్ 11 నుంచి ప్రారంభమైన పోలింగ్, మే 19 వరకు ఏడు విడతల్లో ముగిసింది. 2019 మే 23న ఓట్ల లెక్కింపు జరిగింది. ఈసారి కూడా ఏప్రిల్-మే నెలల్లోనే ఎన్నికలు నిర్వహించేలా ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. షెడ్యూల్ ప్రకటించగానే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుంది. నోటిఫికేషన్‌కు ముందే అభ్యర్థుల ప్రకటన

మరోవైపు నోటిఫికేషన్? రాకముందే రాజకీయ పార్టీలు ఎన్నికల సమరంలోకి దిగాయి. ప్రధాన పార్టీలు బీజేపీ, కాంగ్రెస్? సహా అన్ని పక్షాలు తమ అభ్యర్థులను ప్రకటిస్తున్నాయి. బీజేపీ తొలి జాబితాలో 195 మందిని ప్రకటించగా, రెండో జాబితాలో 72 మంది అభ్యర్థులకు టికెట్లు ఖరారు చేసింది. మరోవైపు కాంగ్రెస్ సైతం తొలుత 39మందితో జాబితా విడుదల చేయగా, రెండోసారి 43 మంది అభ్యర్థులను ప్రకటించింది. టీఎంసీ, ఆప్?, ఎస్?పీ ఇలా దాదాపు అన్ని పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించాయి.

## ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో సంబంధించి మనీ లాండరింగ్ చట్టం 20 22(15 ఆఫ్ 2003)

### ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేసిన ఈడీ అధికారులు



హైదరాబాద్, మార్చి 15(భారత్ సమాచార్) ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో సంబంధించి మనీ లాండరింగ్ చట్టం 20 22(15 ఆఫ్ 2003) బిఆర్ఎస్ నాయకురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను అరెస్ట్ చేసి శంషాబాద్ విమానాశ్రయానికి నుంచి ఢిల్లీకి తరలించిన ఈడీ అధికారులు ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో బీఆర్ ఎస్ఎమ్మెల్సీ కవితను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు అరెస్ట్? చేశారు.శుక్రవారం మధ్యాహ్నం నుంచి కవిత నివాసంలో సోదాలు నిర్వహించి ఈడీ అధికారులు, సోదాల అనంతరం ఆవెను అరెస్ట్? చేశారు. ఈ సందర్భంగా ఏ ప్రాతిపదికన తనను అరెస్ట్ చేస్తారంటూ కవిత ఎన్?ఫోర్స్?మెంట్ అధికారులను ప్రశ్నించినట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున కవిత ఇంటి వద్దకు చేరుకుని కేంద్ర ప్రభుత్వం, ఈడీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అరెస్ట్?పై స్పందించిన బీఆర్ఎస్‌లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి సోమ భరత్ ఎందుకు అరెస్టు చేస్తున్నారో చెప్పలేదన్నారు. సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా, ఎన్నికల ముందు అరెస్టులేంటని ఆయన ప్రశ్నించారు. దీనిపై న్యాయ పోరాటం చేస్తామన్నారు. మరోవైపు అరెస్టుతో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ప్రశాంత్? రెడ్డితో పాటు పలువురు బీఆర్?ఎస్? నేతలు కవిత నివాసం వద్దకు చేరుకున్నారు.

## ఆర్థిక మూలాలు దెబ్బతీసేస్తున్నారా...

హైదరాబాద్, మార్చి 15 రేవంత్ రెడ్డి దూకుడు ఆగడం లేదు.. కెసిఆర్ మూలాలను, కెసిఆర్ ఆర్థిక స్తంభాలను సమూలంగా పెకిలించే పనిలోపడ్డాడు. ఇప్పటికే ప్రణీత్ రావును అరెస్టు చేసి ఎవరెవరి ఫోన్లు ట్యాంపరింగ్ చేశారు? దీని వెనుక ఉన్నది ఎవరు? ఎవరు చేయమంటే చేశారు? అనే కోణంలో తీగలాగుతున్నాడు. అక్రమంగా సంపాదించిన ఆస్తులను పడగొడుతున్నాడు.. ఇప్పుడు కెసిఆర్ ఆర్థిక స్తంభమైన మై హోమ్ మీద పడ్డాడు. ఈ సంస్థ భూదాన్ భూముల్లో నిర్మించిన అక్రమ నిర్మాణాలపై శివకాశి నోటీసులు భూదాన్ భూముల్లో నిర్మించిన అక్రమ నిర్మాణాలపై శివకాశి నోటీసులు జారీ భూదాన్ భూముల్లో నిర్మించిన అక్రమ నిర్మాణాలపై రేవంత్ దృష్టి సారించాడు.హైదరాబాద్ నగర శివారులో భూదాన్ భూములను మై హోమ్ ఆక్రమించిందనేది ప్రభుత్వ వాదన. గత ప్రభుత్వం ఈ భూములను మై హోమ్ కంపెనీకి ధారా దత్తం చేసిందని రేవంత్ వద్ద స్పష్టమైన సమాచారం ఉందని వినికిడి. అందులో భాగంగానే రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ద్వారా మై హోం కంపెనీకి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. 150 ఎకరాల భూదాన్ భూముల్లో జూపల్లి రామేశ్వరరావుకు చెందిన మై హోమ్ కంపెనీ అక్రమంగా నిర్మాణాలు చేపట్టిందని.. వాటిపై వివరణ ఇవ్వాలని ప్రభుత్వం నోటీస్ జారీ చేసింది. దీంతో ఒక్కసారిగా కలకలం నెలకొంది. వాస్తవానికి రేవంత్ రెడ్డికి, మై హోమ్ జూపల్లి రామేశ్వరరావుకు ఎక్కడ చెడిందో గాని.. ఇద్దరి మధ్య చాలా గ్యాప్ ఉంది. అప్పట్లో రామేశ్వరరావు తో పడిన గొడవ వల్లే కెసిఆర్ రేవంత్ రెడ్డికి ఘర్షణ మొదలైందని రాజకీయ వర్గాలు అంటుంటాయి. ఆ ఘర్షణ కాస్త చినికి చినికి గాలి వాన లాగా మారి ఇక్కడ దాకా తీసుకొచ్చిందని చెబుతుంటాయి.సో, అందువల్లే రేవంత్ మై హోమ్ జూపల్లి రామేశ్వరరావు వ్యాపారాలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఒకవేళ ఇచ్చిన షోకాజ్ నోటీసుకు సానుకూలమైన స్పందన రాకుంటే ఆ భూదాన్ భూముల్లో నిర్మించిన భవనాలను ప్రభుత్వం పడగొట్టే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. దీనిపై మై హోమ్ కోర్టుకు వెళ్లినప్పటికీ ఉపశమనం లభించదని, ఎందుకంటే ప్రభుత్వం వద్ద స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. ఒకవేళ ఈ నిర్మాణాలను రేవంత్ పడగొట్టి, భూములను స్వాధీనం చేసుకుంటే మాత్రం ఒక చరిత్రే అవుతుంది. బిజెపి సెంట్రల్ నాయకులతో మంచి సంబంధాలు మెయింటైన్ చేస్తున్న జూపల్లి రామేశ్వరరావు.. తన సమస్యను అక్కడిదాకా తీసుకు రాగలడా అనేది ఇక్కడ ప్రధాన ప్రశ్న.

# తహెల్కా న్యూస్

తెలుగు దినపత్రిక

16.03.2024 శనివారం

# కార్పొరేట్ క్విడ్ ప్రోకో..

ఎలక్టోరల్ బాండ్ వివరాలను వెల్లడించడానికి జూన్ 30 వరకు పొడిగింపు కోసం సుప్రీంకోర్టులో ఎస్బీఐ పిటిషన్ దాఖలు చేస్తే, ఈ పొడగింపు కుదరదంటూ.. మార్చి 12వ తేదిలోపు వివరాలు సమర్పించాలని ఆదేశించింది. దీంతో ఎస్బీఐ ఆ వివరాలను ఈసీకి అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచింది. సుప్రీంకోర్టు తీర్పు రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రభావం చూపుతుందని చెప్పవచ్చు. పాలక పక్షం ప్రాపకం కోసం పాకులాడని కార్పొరేట్ సంస్థ ఉంటుందా? అని ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ వంటి ఆర్థిక వేత్తలు సందేహాలు వ్యక్తం చేయడం ఈ సందర్భంగా మన గుర్తించుకోవాలి. కార్పొరేట్ చందాల పై సుప్రీంకోర్టు తీర్పు స్వాగతించదగిన పరిణామమే అయితే, అసలు సమస్య ఎన్నికల వ్యయం, దాని వెనక ఉండేటటువంటి అవినీతి, వ్యక్తిగత చందాల ద్వారా అవినీతి జరగదనే గ్యారెంటీ ఏమీ ఉండదనేది వాస్తవం. ఎన్నికల వ్యయం ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయి,రాజకీయ పార్టీలు కార్యకర్తల చందాల మీద మాత్రమే ఆధారపడే రోజులు ఎప్పుడో పోయాయి. ప్రస్తుతం అవినీతికి దారి తీసే లొసుగులను చక్కదిద్దటం తక్షణావసరం. అందుకే ఓటర్లందరూ విద్యావంతులై ఆలోచించాలి. అవినీతికి కళ్లెం పడుతున్న ప్రభుత్వాలను కూల్చి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి.రాజకీయ చందాలకు చట్టబద్ధమైన నిధులను నియంత్రిత బ్యాంకింగ్ మార్గాల ద్వారా సేకరించడాన్ని ప్రోత్సహిస్తున్నామని, చందాలు ఇచ్చుకునే వారు రాజకీయ వేధింపులకు గురికాకుండా ఉండేందుకు పేర్లను గోప్యంగా ఉంచటం అవసరమని ప్రభుత్వం చేసిన వాదనను ధర్మాసనం గతంలోనే తోసిపుచ్చింది. కంపెనీలు చందాలు ఇస్తున్నాయి అంటే, బదులుగా ఏదైనా లబ్ధి పొందాలని ఆలోచన దాని వెనక దాగి ఉండే అవకాశాలు ఉంటాయని ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ అభిప్రాయపడ్డారు. అంటే, ఇచ్చిపుచ్చుకునే ధోరణి (క్విడ్ ప్రో కో) ఇక్కడ పనిచేస్తుందని స్పష్టం చేశారు. స్వేచ్ఛాయుత ఎన్నికల ప్రక్రియకు ఈ ఇచ్చుకోవడం అనేది గొడ్డలిపెట్టు వంటిదని హెచ్చరించారు. బాండ్లు పారదర్శకతకు మసి పూస్తాయని గతంలో ఈ కేసు విచారణ సందర్భంగా ఆయన ఉటంకించారు.నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అత్యుత్సాహంతో అమలు చేసిన ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమని 2024 ఫిబ్రవరి 15న చారిత్రాత్మకమైన తీర్పును వెలువరించింది. ఈ పథకం సమాచార హక్కును ఉల్లంఘిస్తున్నదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల బెంచ్ ఏకాభిప్రాయ తీర్పులో స్పష్టం చేసింది. అయితే, ఈ కేసులో ప్రధానంగా రెండు అంశాలు ఉన్నాయి. కార్పొరేట్లు రాజకీయ పార్టీలకు ఎలక్టోరల్ బాండ్ల ద్వారా ‘స్వచ్ఛందంగా’ చెల్లించే చందాల సమాచారం గోప్యంగా ఉంచటం చెల్లుతుందా? తదనుగుణంగా ప్రజాప్రాతినిధ్య చట్టానికి, ఆదాయపు పన్ను చట్టానికి, కంపెనీల చట్టానికి చేసిన సవరణలు చెల్లుబాటు అవుతాయా? అనేది మొదటిది. ఇక రెండోది... కార్పొరేట్లు రాజకీయ పార్టీలకు ‘అపరిమితమైన’ చందాలు సమర్పించుకోవడానికి సంబంధించి కంపెనీల చట్టానికి చేసిన మరో సవరణ రాజ్యాంగబద్ధత గురించి. ఈ రెండు అంశాల్లోనూ కేంద్రానికి ప్రతికూలంగానే కోర్టు తీర్పు వెలువడింది.పౌరులు తమ ‘ఓటు హక్కును సమర్థవంతంగా వినియోగించుకోవాలంటే రాజకీయ పార్టీలకు అందుతున్న నిధుల సమాచారం తెలుసుకోవడమనేది తప్పనిసరని ప్రధాన న్యాయమూర్తి చెప్పారు. కానీ ఈ పథకంలో పారదర్శకత లోపించడాన్ని సుప్రీంకోర్టు ఎత్తిచూపింది. రాజ్యాంగంలోని 19(1 )(ఏ) అధికరణాన్ని ఇది స్పష్టంగా ఉల్లంఘిస్తున్నది అని ఆయన తేల్చి చెప్పారు. ఈ తీర్పు పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీజేపీకి పెద్ద చెంపదెబ్బేనని చెప్పాలి. అంతేకాక ఎస్బీఐ ఈ బాండ్ల జారీని తక్షణమే నిలిపివేయాలని ఆదేశించింది. పైగా తీర్పు వెలువడే వరకు నగదుగా మార్చుకోని బాండ్లను పార్టీలు వెనక్కి తిరిగి ఇచ్చివేయాలని కూడా స్పష్టం చేసింది. మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన 2019 ఏప్రిల్ 12 నుంచి మొత్తం అన్ని బాండ్ల వివరాలు సమర్పించాలని ఎస్బీఐని ఆదేశించింది. అదేవిధంగా, ఎలక్టోరల్ బాండ్ల ద్వారా నిధులు పొందిన రాజకీయ పార్టీల వివరాలను తెలపాలని పేర్కొంది. ఈ రెండు మార్చి 6వ తేదీలోగా జరగాలని గడువును కూడా విధించింది. కానీ దానిని జూన్ 30 వరకు పొడిగించాలని ఎస్బీఐ కోరింది.నిర్దిత పరిస్థితుల్లో కంపెనీలు రాజకీయ పార్టీలకు నిధులు సమకూర్చ వచ్చునని కంపెనీలు చట్టం(2013)లో 182 వ నిబంధన అనుమతిస్తున్నది. అయితే, 2017 లో ‘ఫైనాన్స్ చట్టానికి’ సవరణలు చేయడం ద్వారా మోడీ ప్రభుత్వం అనేక మినహాయింపులను అమలులోకి తెచ్చింది. వీటి ఆధారంగా 2018 నుంచి ఎలక్టోరల్ బాండ్ల పథకం అమల్లోకి వచ్చింది. 2018 నుంచి 2022 మార్చి వరకు జారీ అయిన మొత్తం ఎలక్టోరల్ బండ్లలో 57 శాతం అంటే, రూ.5,271 కోట్లు బీజేపీకి వెళ్లాయి. ప్రతిపక్ష కాంగ్రెస్‌కు 951 కోట్లు మాత్రమే దక్కాయి. అంటే పథకంలో ఉన్న మొగ్గును సూచిస్తుంది.

# కలకలం రేపుతున్న ఎలక్ట్రోరల్ బాండ్స్

హైదరాబాద్, మార్చి 15, సుప్రీంకోర్టు సంచలన తీర్పు మేరకు తొలిసారిగా కేంద్ర ఎన్నికల సంఘం ఎలక్టోరల్ బాండ్ల వివరాలను వెల్లడించింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఈ డేటాను ఈసీకి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సమర్పించగా ఆ వివరాలను ఎన్నికల సంఘం తమ వెబ్ సైట్‌లో అధికారికంగా ప్రకటించింది. రెండు భాగాలుగా ప్రకటించిన 337 పేజీల డేటా ఆధారంగా 2019 ఏప్రిల్ నుంచి 2024 జనవరి వరకూ 11వేల 671కోట్ల రూపాయల విలువైన ఎన్నికల బాండ్లను వివిధ సంస్థలు, వ్యక్తులు కొనుగోలు చేశాయి. ఏ కంపెనీ ఏ రాజకీయపార్టీకి ఎంత విరాళాలు ఇచ్చింది అనే విషయాన్ని ఈసీ వెల్లడించకపోయినా ఏ కంపెనీ ఎన్ని కోట్ల డబ్బులు పార్టీల కోసం ఇస్తున్నాయో ఓ క్లారిటీ వచ్చింది. జాతీయ పార్టీలైన బీజేపీకి అత్యధికంగా రూ.6,061కోట్లు, కాంగ్రెస్ కోసం రూ.1,422 కోట్ల రూపాయల బాండ్లు కొనుగోలు చేశారు. కాంగ్రెస్ కంటే ఎక్కువగా తృణమూల్ కోసం రూ.1,610 కోట్ల విలువైన బాండ్లు కొనుగోలు చేశారు.వైఎస్ జగన్ నేతృత్వంలోని వైసీపీ ఏపీలో ఎన్నికల బాండ్ల విరాళాల్లో మొదటి స్థానంలో నిలిచింది. ఆపార్టీకి ఇప్పటివరకూ 337కోట్ల రూపాయలు అధికారికంగా అందాయి. రూ.219కోట్లతో రెండోస్థానంలో టీడీపీ, రూ.21కోట్ల రూపాయల విరాళాలు పొంది జనసేన మూడోస్థానంలో ఉన్నాయి. తెలంగాణలో బీఆర్ఎస్ కు రూ.1,215 కోట్ల విరాళాలు అందాయి.బాండ్లను కొనుగోలు చేసిన కంపెనీల్లో స్టీల్ పారిశ్రామిక దిగ్గజం లక్ష్మీ మిత్తల్ నుంచి బిలియనీర్ సునీల్ భారతీ మిత్తల్, అనిల్ అగర్వాల్, ఐటీసీ, మహీంద్ర అండ్ మహీంద్ర, తెలుగు రాష్ట్రాల నుంచి ఎదిగిన మేఘా ఇంజినీరింగ్, షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ లాంటి కంపెనీలు ఉన్నాయి. ఇక్కడో ఇంకో సీరియస్ విషయం ఏంటంటే.. అసలు అంతగా పేరులేని ఫ్యూచర్ గేమింగ్ అండ్ హోటల్ సర్వీసెస్ అనే సంస్థ దేశంలోనే అత్యధికంగా 1,368కోట్ల రూపాయలు విరాళాలను పొలిటికల్ పార్టీలకు బాండ్ల రూపంలో కొనిపెట్టింది. ఇంతకీ ఈ కంపెనీ వివరాలు ఏంటనేది ఎవరికీ తెలియదు. ఇదో డొల్ల కంపెనీ అనే అనుమానాలతో 2022 మార్చి నుంచి ఈడీ రైడ్స్ కూడా జరుగుతున్నాయి దీని మీద. సో ఈ కంపెనీ 1368కోట్ల రూపాయలు ఏ పార్టీకి ఇచ్చింది ప్రస్తుతానికైతే సీక్రెట్. ఇప్పటి వరకు ప్రకటించిన డేటాలో ఉన్న కొన్ని కంపెనీలు పాకిస్థాన్ బేస్డ్‌గా నడుస్తున్నాయేన చర్చ సాగుతోంది. ఆ కంపెనీలకు సంబంధించిన పూర్తి వివరాలు మాత్రం తెలియడం లేదు. మరోవైపు యశోద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ రూ.162 కోట్లు, స్టీల్ టైకూన్ లక్ష్మీ మిత్తల్ సొంతంగా రూ.35 కోట్లు, ఆయన కంపెనీలు మరో రూ.247 కోట్ల విలువైన బాండ్లు కొన్నాయి. జిందాల్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్: రూ.123 కోట్లు. బిర్లా కార్బన్ ఇండియా: రూ.105 కోట్ల రూపాయల బాండ్ల కొనుగోలు చేశాయి. . తెలుగు రాష్ట్రాల్లో పేరు పొందిన మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ సంస్థ రాజకీయ పార్టీలకు రూ.966 కోట్ల విరాళం ఇచ్చింది. షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ ఈ ఏడాది జనవరి 11వ తేదీన ఒక్క రోజే రూ.కోటి విలువైన 40 బాండ్లను కొనుగోలు చేసి రూ.40 కోట్ల విరాళం ఇచ్చింది.

మరికొన్ని తెలుగు కంపెనీల వివరాలు

డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ లిమిటెడ్: రూ.80 కోట్లు

హెటిరో గ్రూప్: రూ.60 కోట్లు'

నవయుగ ఇంజినీరింగ్ కంపెనీ లిమిటెడ్: రూ.55 కోట్లు

దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్: రూ.55 కోట్లు

అరబిందో ఫార్మా లిమిటెడ్: రూ.50 కోట్లు

రిత్విక్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్: రూ.45 కోట్లు

మైహోం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్: రూ.25 కోట్లు

భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్: రూ.10 కోట్లు

శ్రీచైతన్య స్టూడెంట్స్ మేనేజ్‌మెంట్: రూ.6 కోట్లు

## పటాన్ చెరు పోలీస్ స్టేషన్ ముందు ఉద్రిక్తత

సంగారెడ్డి శుక్రవారం ఉదయం పటాన్ చెరు పోలీసు స్టేషన్ ముందు ఉద్రిక్తత నెలకొంది.ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సోదరుడు మధుసూదన్ రెడ్డిని వైద్య పరీక్షల కోసం ఆస్పత్రికి తీసుకెళ్తుండగా బీఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుకున్నారు. పోలీస్ వాహనంపై దాడి చేసారు. కార్యకర్తల్ని నిలువరించి నేరుగా వైద్య పరీక్షల కోసం సంగారెడ్డి జిల్లా ఆస్పత్రికి పోలీసులు తీసుకెళ్లారు.

## ప్రచారం ప్రారంభించిన ఆరణి

తిరుపతి అభ్యర్థిగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చిత్తూరుకు చెందిన ఆరణి శ్రీనివాసులు పేరు ప్రకటించడంతో ఈరోజు ఉదయం స్థానిక కపిలతీర్థంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేసి ప్రచారం ప్రారంభించారు. అనంతరం తిరుపతి శ్రీ తాతయ్య గుంట గంగమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు.

అదే సమయాన వైకాపా అభ్యర్థి భూమన అభినయ్ రెడ్డి ఎదురుపడటంతో ఒకరినొకరు పలకరించుకున్నారు. ప్రస్తుతం స్థానిక తెదేపా,జనసేనా పార్టీల నాయకులు,కార్యకర్తలు ఎన్నికల ప్రచారంలో పనిచేస్తారా,లేదా వేచిచూడాలి.

# 16న టీడీపీ గూటికి మాగుంట

ఒంగోలు, మార్చి 14 ఒంగోలు ఎంపి మాగుంట టిడిపిలో చేరేందుకు ముహూర్తం ఖరారైంది. ఈనెల 16న ఎంపి మాగుంట, ఆయన కుమారుడు మాగుంట రాఘవరెడ్డి ఉండవల్లిలో చంద్రబాబు సమక్షం లో టిడిపిలో చేరనున్నారు. రాఘవరెడ్డికి ఒంగోలు పార్లమెంట్ టిడిపి టికెట్ ఇచ్చేందుకు ఇప్పటికే చంద్రబాబు సుముఖత వ్యక్తం చేశారు. నేడో, రేపో టిడిపి రెండో జాబితా వెలువడే అవకాశాలు ఉండటం తో ఒంగోలు పార్లమెంట్ పరిధి లోని మిగిలిని అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థుల ఎంపిక విషయంలో మాగుంట సూచనలను టిడిపి అధిష్టానం పరిగణలోకి తీసుకునే అవకాశాలుఉన్నాయి. టిడిపిలో చేరిన వెంటనే పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన టిడిపి అభ్యర్దులతో మాగుంట సమావేశం కానున్నారు. 2014లో టిడిపి టికెట్‌పై పోటీ చేసి ఓడిపోయిన మాగుంట కుటుంబానికి ఈసారైనా టిడిపి నుంచి గెలుపు సాధ్యమవుతుందా? అన్న చర్చ ఆ పార్టీలో జోరుగా సాగుతోంది.ఈనెల 16న ఉండవల్లిలో టిడిపి అధినేత చంద్రబాబు సమక్షంలో ఎంపి మాగుంట తన కుమారుడు మాగుంట రాఘవరెడ్డితో కలిసి టిడిపి తీర్థం పుచ్చుకోనున్నారు? సరిగ్గా 2014 ఎన్నికల్లో కూడా ఇదే జరిగింది. అప్పట్లో కాంగ్రెస్ ఎంపిగా ఉన్న మాగుంట శ్రీనివాసులురెడ్డి వైసిపి టికెట్‌పై పోటీ చేసేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు? దీంతో విధిలేని పరిస్థితుల్లో టిడిపిలో చేరి బిజెపి-టిడిపి-జనసేన ఉమ్మడి అభ్యర్థిగా ఒంగోలు పార్లమెంట్ నుంచి పోటీ చేసి కేవలం 15 వేల ఓట్ల తేడాతో మాగుంట ఓడిపోయారు? అయితే 2014 ఎన్నికల్లో టిడిపి ఎపిలో అధికారంలోకి రావడంతో మాగుంటను స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీకి దించడంతో ఆయన గెలుపొందారు. ఆ సమయంలో మాగుంటకు మంత్రి పదవి ఇస్తారని ఆశించారు. అయితే చంద్రబాబు మాగుంటకు మంత్రి పదవి ఇవ్వలేదు. అనంతరం 2019 ఎన్నికల్లో మాగుంట తిరిగి వైసిపిలో చేరి ఒంగోలు పార్లమెంట్ నుంచి వైసిపి టికెట్‌పై పోటీ చేసి 2.14 లక్షల భారీ మెజార్టీతో గెలుపొందారు. తిరిగి 2024లో కూడా మాగుంట వైసిపి టికెట్‌పై పోటీ చేసేందుకు చివరివరకు పోరాడారు. అయితే ఆయనకు వైసిపి అధినేత, సియం వైయస్ జగన్ ఈసారి ఎంపి టికెట్ ఇచ్చేందుకు నసేమిరా ఒప్పుకోలేదు. మాగుంట కాంబినేషన్ అయితే ఒంగోలుతో పాటు మరో రెండు మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైసిపి అభ్యర్ధులు గెలుపొందే అవకాశాలు ఉన్నాయని భావించిన మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసులురెడ్డి మాగుంట కోసం చివరి వరకు పార్టీ అధిష్టానంతో పోరాడారు? అయితే బాలినేని ప్రయత్నాలు ఫలించకపోవడంతో ఈసారి మాగుంట తనదారి తాను చూసుకున్నారు? ఫిబ్రవరి 28వ తేదిన మాగుంట పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు? అప్పటికే టిడిపి అధినేత చంద్రబాబుతో టచ్లో ఉన్న మాగుంటకు ఈనెల 16వ తేదిన పార్టీలో చేరేందుకు చంద్రబాబు అనుమతి ఇచ్చారు? దీంతో ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి, తన కుమారుడు మాగుంట రాఘవరెడ్డితో కలిసి ఉండవల్లిలో చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరేందుకు రంగం సిద్దం చేసుకుంటున్నారు. 2014 ఎన్నికల్లో వైసిపి టికెట్‌పై ఎంపిగా పోటీ చేసేందుకు మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రయత్నించారు. 2009లో కాంగ్రెస్ ఎంపిగా గెలుపొందిన మాగుంట రాష్ట విభజన తరువాత ఏపీలో కాంగ్రెస్ అడ్రస్ గల్లంతు కావడంతో 2014 ఎన్నికలకు ముందు వైసిపిలో చేరేందుకు ప్రయత్నించారు. అయితే అప్పటికే వైవి సుబ్బారెడ్డిని పార్లమెంట్ నుంచి పోటీ చేయించేందుకు వైయస్ జగన్ నిర్ణయించుకోవడంతో మాగుంటకు వైసిపిలో ఛాన్స్ దక్కలేదు. దీంతో టిడిపి పార్టీలో చేరిన మాగుంట 2014 ఎన్నికల్లో టిడిపి టికెట్‌పై పోటీ చేసి కేవలం 15 వేల ఓట్ల తేడాతో వైవి సుబ్బారెడ్డిపై ఓడిపోయారు? ఆ తరువాత జరిగిన పరిణామాల్లో భాగంగా 2019 ఎన్నికలకు ముందు వైసిపిలో చేరిన మాగుంటకు వైవి నికాదని ఎంపి టికెట్ ఇచ్చింది వైసిపి అధిష్టానం? ఈ ఎన్నికల్లో మాగుంట 2.14 లక్షల మెజారిటీతో వైసిపి నుంచి గెలుపొందారు? అప్పటి నుంచి వైసిపిలో ఎంపిగా కొనసాగుతున్న మాగుంట ఈసారి ఎన్నికల్లో తన రాజకీయ వారసుడు మాగుంట రాఘవరెడ్డిని పోటీకి నిలబెడుతున్నట్టు ప్రకటించారు. ఆతరువాత రాఘవరెడ్డి ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఇరుక్కోవడం, బెయిల్‌పై బయటకు రావడం తెలిసిందే. అయితే ఈసారి కూడా మాగుంట కుటుంబానికి వైవి సుబ్బారెడ్డి రూపంలో అడ్డంకి ఎదురైందట?అంతేకాకుండా మరికొన్ని ఇతర కారణాలు కూడా తోడు కావడంతో ఈసారి మాగుంటకు టికెట్ ఇవ్వకుండా వైవి సుబ్బారెడ్డి లేదా ఆయన కుమారుడు వైవి విక్రాంత్‌రెడ్డికి టికెట్ ఇవ్వాలని వైసిపి అధిష్టానం తొలుత నిర్ణయించినట్టు సమాచారం? అయితే అనూహ్య పరిస్థితుల్లో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ఒంగోలు ఎంపి అభ్యర్థిగా సియం అధిష్టానం నిర్ణయించండంతో మాగుంటకు వైసిపిలో దారులు మూసుకుపోయాయి. దీంతో ఇక విధిలేని పరిస్థితుల్లో టిడిపి నుంచి పోటీ చేయడానికి మాగుంట కుటుంబం సిద్దమైంది. దీంతో మాగుంట కుటుంబానికి 2014 సీన్ రిపీట్ అయినట్టు చెబుతున్నారు.

# అమర్ నాథ్ కు లైన్ క్లియర్

విశాఖపట్టణం, మార్చి 15 ఆంధ్రప్రదేశ్ ఐటీ మంత్రి అమర్‌నాథ్‌కు బెర్త్ ఖాయమైంది. వచ్చే ఎన్నికల్లో మంత్రి పోటీ చేస్తారా? లేదా? అన్న ఉత్కంఠకు తెరపడింది. మంత్రి స్వస్థలం గాజువాక నుంచి అసెంబ్లీ టికెట్ కన్ఫార్మ్ చేసింది వైసీపీ అధిష్టానం.. దీంతో మంత్రి అమర్‌నాథ్ రాజకీయ భవిష్యత్‌పై సందేహాలన్నీ తొలగిపోయాయి.సీఎం జగన్‌కు అత్యంత సన్నిహితుల్లో ఒకరు ఐటీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్. తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచినా? సీఎం క్యాబెనెట్లో బెర్త్ దక్కించుకున్న అమర్‌నాథ్.. రాజకీయ భవిష్యత్‌పై ఇటీవల కాలంలో కొన్ని సందేహాలు వ్యక్తమయ్యాయి. అయితే తాజాగా వైసీపీ అధిష్టానం తీసుకున్న నిర్ణయంతో మంత్రి అమర్‌నాథ్ పొలిటికల్ కెరీర్‌కు లైన్‌క్లియర్ అయినట్లైంది.అనకాపల్లి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న అమర్‌నాథ్‌కు గాజువాక సమన్వయకర్తగా నియమించింది వైసీపీ అధిష్టానం. ఐతే గత మూడు నెలలుగా జరిగిన పరిణామాలు మంత్రి రాజకీయ భవిష్యత్‌పై ఊహాగానాలకు అవకాశమిచ్చాయి. మంత్రి సిట్టింగ్ స్థానం అనకాపల్లి ఇన్‌చార్జిగా మలసాల భరత్‌కుమార్‌ను గతంలో నియమించింది వైసీపీ అధిష్టానం.కానీ, మంత్రికి ఇంతవరకు ప్రత్యామ్నాయం చూపలేదు. వాస్తవానికి మంత్రి కూడా చాలా కాలంగా కొత్త స్థానం వెతుకులాటలోనే ఉన్నారు. ఈ సారి అనకాపల్లి నుంచి పోటీ చేసే ఉద్దేశం మంత్రి అమర్‌నాథ్‌కూ లేకపోయినా? ఆయన ఎక్కడి నుంచి పోటీ చేయాలన్నదానిపై సస్పెన్స్ కొనసాగింది. పెందుర్తి, చోడవరం, అనకాపల్లి ఎంపీ టికెట్ అంటూ రకరకాల ప్రచారం జరిగింది. కానీ, వాటి అన్నిటికీ ఫుల్‌స్టాప్ పెట్టి గాజువాక సీటు కట్టుబెట్టింది వైసీపీ హైకమాండ్.గాజువాక సిట్టింగ్ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి బదులుగా ఆ స్థానంలో యాదవ సామాజిక వర్గానికి చెందిన కార్పొరేటర్ వరకూటి రామచంద్రరావును ఇన్‌చార్జిగా నియమించింది వైసీపీ? గత ఎన్నికల్లో జనసేనాని పవన్‌ను ఓడించిన నాగిరెడ్డిని ఈ సారి తప్పించడానికి సామాజిక సమీకరణలే కారణంగా చూపింది.ఐతే ప్రతిపక్షాలను ఢీకొట్టే విషయంలో ప్రస్తుత ఇన్‌చార్జి వరికూటి రామచంద్రారావు సరిపోరనే భావనతో తాజాగా ఆయనను పక్కన పెట్టి ఆ బాధ్యతలు మంత్రి అమర్‌నాథ్‌కు అప్పగించింది. వాస్తవానికి గత మూడు నెలలుగా జరిగిన పరిణామాలతో మంత్రి అమర్‌నాథ్‌కు టికెట్ దక్కదనే ప్రచారం జరిగింది.సీఎం జగన్ కూడా ఇటీవల విశాఖ వచ్చినప్పుడు అమర్‌నాథ్ పోటీపై ఎలాంటి ప్రకటన చేయలేదు సరికదా జిల్లాలో 15 ఎమ్మెల్యే సీట్లు గెలిపించే బాధ్యత అమర్‌దేనంటూ భారం మోపారు. దీంతో తాను సీఎం జగన్ ఏం చెబితే అదే చేస్తానని.. తన భవిష్యత్ సీఎం జగన్‌పైనే ఆధారపడిందని సెంటిమెంట్ రగిలించారు మంత్రి అమర్‌నాథ్.సిట్టింగ్ స్థానం నుంచి తప్పించినా, మూడు నెలలుగా టికెట్‌పై ఎలాంటి స్పష్టత ఇవ్వకపోయినా, పార్టీకి విధేయుడిగా పనిచేయడంతో మంత్రి అమర్‌నాథ్ విషయంలో సానుకూల నిర్ణయం తీసుకుంది వైసీపీ అధిష్టానం. ఊహాగానాలను అన్నింటిని పక్కన పెట్టి మంత్రి స్వస్థలం గాజువాక టికెట్ కన్ఫార్మ్ చేసింది. గాజువాక పక్కనే ఉండే మింథిలో అమర్‌నాథ్ సొంత ఇల్లు ఉంది.మంత్రి రాజకీయ జీవితం ప్రారంభించినప్పుడు కూడా ఇదే ప్రాంతంలో కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. ఏవిధంగా చూసినా మంత్రి అమర్‌కు గాజువాక సేఫ్ ప్లేస్ అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అనకాపల్లి నుంచి తప్పించినా, మంత్రి అమర్‌నాథ్ మాత్రం? తనకు ఫలానా సీటు కావాలని అధిష్టానాన్ని అడగలేదని చెబుతున్నారు. అందుకే అమర్ బాధ్యత తనది అని చెప్పిన సీఎం జగన్?. ఇచ్చిన మాట ప్రకారం మంత్రికి పట్టున్న ప్రాంతంలోనే అవకాశమిచ్చారంటున్నారు. మంత్రి అమర్ గెలుపుతోపాటు జిల్లాలోని మిగిలిన స్థానాల గెలుపు బాధ్యతలను మోపారంటున్నారు.

## సాబకోట సచివాలయంలో ఏసిబి సోదాలు

శ్రీకాకుళం జిల్లా మందస మండలం సాబకోట సచివాలయంలో ఏసిబి అధికారుల మెరుపు దాడుల్లో లంచం తీసుకుంటూ ఇంజనీరింగ్ అసిస్టెంట్ పట్టుబడ్డాడు . సాబకోట గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న కాలనీ హౌసింగ్ బిల్లుల కోసం సింగుపురం గ్రామానికి చెందిన నిమ్మక పరశురాం అనే లబ్దిదారుడి నుంచి రూ. 5000/- లంచం తీసుకుంటూ సాబకోట సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఎస్ లోకనాథం ఏసీబి అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సాబకోట పంచాయతీ సిరిపురానికి చెందిన నిరుపేద లబ్దిదారుడు పరశురాం పునాదుల వరకు ఇంటి నిర్మాణం చేశాడు.హౌసింగ్ స్కీం నుంచి తనకు రావాల్సిన సబ్సిడీ సొమ్ము ను తన ఖాతాలో జమ చేయాలని సాబకోట ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఎస్ లోకనాథం ను సంప్రదించాడు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ లోకనాథం లబ్దిదారుడికి హౌసింగ్ బిల్లులు చెల్లించకుండా కాలయాపన చేశాడు. సాబకోట సచివాలయం చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగిన పరశురాం కు రూ.5 వేలు లంచంగా ఇస్తే హౌసింగ్ బిల్లులు ముంజూరు చేస్తానని ఇంజనీరింగ్ అసిస్టెంట్ లోకనాథం ప్రలోభ పెట్టాడు. అయితే లంచం ఇవ్వటం ఇష్టం లేక పరశురాం శ్రీకాకుళం లోని అవినీతి నిరోధక శాఖ (ఏసిబి) అధికారులను ఆశ్రయించాడు.

# ప్రతి 15 నిమిషాలకు ఒక కారు చోరీ

హైదరాబాద్, మార్చి 15, వాహనాల చోరీకి సంబంధించిన సంఘటనలు ప్రతిరోజూ వినిపిస్తున్నాయి, అయితే ఇటీవలి ంఅఖ దొంగతనం నివేదిక కొన్ని షాకింగ్ విషయాలు వెల్లడించింది. దేశ రాజధాని ఢిల్లీ దొంగలకు అత్యంత ఇష్టమైన నగరమని, అందుకే ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో ప్రతి 14 నిమిషాలకు ఒక కారు దొంగిలించబడుతుందని ఈ నివేదికలో చెప్పబడింది. ఇది కాకుండా మంగళ, ఆది, గురువారాల్లో వాహనాలు ఎక్కువగా చోరీకి గురవుతున్నాయని తెలిసింది. మిగిలిన రోజుల్లో ఏ కారు చోరీకి గురికాలేదని కాదు, ఇతర రోజులతో పోలిస్తే ఈ మూడు రోజుల్లోనే అత్యధిక సంఖ్యలో వాహనాలు చోరీకి గురయ్యాయి. ఏడు రోజులూ దొంగలు కార్లపై నిఘా ఉంచుతారు. దేశంలో అత్యధికంగా వాహనాలు దొంగిలించబడుతున్న ఐదు నగరాలు ఉన్నాయి. ఈ టాప్ 5 జాబితాలో మొదటి పేరు ఢిల్లీ. చెన్నై రెండో స్థానంలో, బెంగళూరు మూడో స్థానంలో, హైదరాబాద్, ముంబై నాలుగు, ఐదు స్థానాల్లో ఉన్నాయి. ఢిల్లీలోని భజన్‌పురా, షాహదారా, పట్‌పర్‌గంజ్, బదర్‌పూర్ మరియు ఉత్తమ్ నగర్‌లో ప్రజల వాహనాలు ఎక్కువగాదొంగిలించబడుతున్నాయి. ఇక్కడ గమనించదగ్గ విషయం ఏమిటంటే, నిస్సందేహంగా అత్యధిక సంఖ్యలో వాహనాలు చోరీకి గురయ్యే నగరం ఢిల్లీ అయితే మరోవైపు 2022తో పోలిస్తే 2023లో ఢిల్లీలో వాహన దొంగతనాల గ్రాఫ్ పడిపోయింది. ఢిల్లీ నగరంలో 2022లో 56 శాతం వాహనాలు చోరీకి గురికాగా, 2023లో ఈ గ్రాఫ్ 37 శాతానికి తగ్గింది.2022తో పోలిస్తే 2023లో తక్కువ వాహనాలు దొంగతనం జరగడం విశేషం. అత్యధికంగా దొంగిలించబడిన వాహనాల్లో 47 శాతం మారుతీ సుజుకీ వాహనాలేనని ంఅఖ నివేదిక వెల్లడించింది. మారుతీ సుజుకీతో పాటు, హ్యుందాయ్ కంపెనీకి చెందిన వాహనాలు కూడా దొంగతనానికి గురికాకుండా నిఘా ఉంచాయి. ంఅఖ రెండవ దొంగతనం నివేదికలో, అత్యధికంగా దొంగిలించబడిన ఐదు వాహనాల గురించి కూడా ప్రస్తావించబడింది. ఈ టాప్ 5 జాబితాలో మొదటి పేరు మారుతి సుజుకి వ్యాగన్ఆర్. మారుతీ స్విఫ్ట్ రెండో స్థానంలో, హ్యుందాయ్ క్రెటా మూడో స్థానంలో, హ్యుందాయ్ గ్రాండ్ ఐ10 నాలుగో స్థానంలో, మారుతి సుజుకి స్విఫ్ట్ డిజైర్ ఐదో స్థానంలో ఉన్నాయి దొంగల నుండి మీ కారును రక్షించడం చాలా కష్టం, కానీ అసాధ్యం కాదు, మీ వంతుగా కొంచెం జ్ఞానం మీ కారుని కాపాడుతుంది. కారును సేవ్ చేయడానికి, మీరు కారు కోసం కొన్ని భద్రతా గాడ్జెట్‌లను కొనుగోలు చేయాలి. అలారం సిస్టమ్, ఇది కారులో తప్పనిసరిగా ఇన్‌స్టాల్ చేయబడిన సిస్టమ్. ఎవరైనా కారు గ్లాస్ పగలగొట్టినా లేదా బలవంతంగా కారు తెరిచి కారులో కూర్చోవడానికి ప్రయత్నించినా అలారం మోగడం ప్రారంభమై మీకే తెలుస్తుంది.

# తీరిన చింతమనేని చింత

ఏలూరు, మార్చి 15 దెందులూరు తెలుగుదేశం శ్రేణులకు చంద్రబాబు శుభవార్త చెప్పేశారు. తెలుగుదేశం ఫైర్‌బ్రాండ్ చింతమనేని ప్రభాకర్‌కు సీటు కన్ఫార్మ్ చేశారు. స్వయంగా అధినేత చంద్రబాబే ఆయనకు ఫోన్ చేసి టిక్కెట్ నీకేనంటూ చెప్పడంతో ఆయన ఆనందానికి అవధుల్లేవ్..నేడు ప్రకటించనున్న రెండో జాబితాలో చింతమనేని ప్రభాకర్ పేరు ఉండే అవకాశం ఉంది..తెలుగుదేశ ఫైర్‌బ్రాండ్ చింతమనేని ప్రభాకర్‌కు ఎట్టకేలకు సీటు కన్ఫార్మ్ అయ్యింది. తెలుగుదేశం అధినేత చంద్రబాబే స్వయంగా ఆయనకు ఫోన్ చేసి సీటు కన్ఫార్మ్ చేశారు. బుధవారం రాత్రి 7.50 గంటలకు చంద్రబాబు కార్యాలయం నుంచి చింతమనేనికి ఫోన్ వచ్చింది. స్వయంగా చంద్రబాబే(మాట్లాడుతూ..ఈసారి ఎట్టిపరిస్థితుల్లోనూ మనం గెలవాలి..సీటు నీకే ఇస్తున్నాం గెలిపించుకుని తీసుకురా అంటూ చెప్పడంతో చింతమనేని ఒక్కసారిగా కన్నీళ్లు పెట్టుకున్నారు. ఇన్నిరోజుల ఉత్కంఠకు తెరదించుతూ సీటు కేటాయించడంపై ఆయన చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. సర్వేల్లో నువ్వు మంచి మెజార్టీతో గెలవబోతున్నావని...మంచి పదవిలో కూడా ఉంటావని చెప్పడంతో చింతమనేని ఆనందానికి అవధుల్లేవ్. సీటు ఇవ్వడంతోపాటు చంద్రబాబు కొన్ని జాగ్రత్తలు సైతం చెప్పారని తెలిసింది. దూకుడు కొంత తగ్గించుకోవాలని...అతి విశ్వాసం అసలు వద్దని జాగ్రత్తగా పోలింగ్ నిర్వహించాలని చెప్పినట్లు తెలిసింది. తొలి జాబితాలోనే దాదాపు వంద సీట్లు ప్రకటించిన చంద్రబాబు... కచ్చితంగా ఇస్తారనుకున్న దెందులూరు టిక్కెట్ పెండింగ్‌లో పెట్టారు. గత ప్రభుత్వ హయాంలో చింతమనేని ప్రభాకర్ దూకుడు వ్యవహారం కొంత వివాదాస్పదమైంది. ఎమ్మార్వోతో గొడవ, విలేకరిపై దాడి, కోడిపందెం, మంత్రివర్గంలో చోటు కల్పించకపోవడంపై బహిరంగ వ్యాఖ్యలు ఇవన్నీ పార్టీని కొంత ఇబ్బందిపెట్టడంతో ఈసారి ఆయనకు టిక్కెట్ ఇవ్వడం అనుమానమేనని తెలుగుదేశం నేతలే చర్చించుకున్నారు. దీన్ని బలపరుస్తూ ఆయనకు మొదటి విడత కోటాలో టిక్కెట్ కన్ఫార్మ్ చేయలేదు. దీంతో దెందులూరు తెలుగుదేశం శ్రేణులతోపాటు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోనూ తెలుగుదేశం నేతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. చింతమనేని దూకుడు కొంత ఇబ్బందికర పరిస్థితి అయినప్పటికీ....వైసీపీ నేతలను తట్టుకోవాలంటే ఆయన ఫైర్ ఉండాల్సిందేనంటూ చంద్రబాబుకు సూచించారు. చింతమనేని ప్రభాకర్‌కు కేవలం ఆయన నియోజకవర్గంలోనే గాక... రాష్ట్రవ్యాప్తంగానూ అభిమానులు ఉన్నారు. సభలోనూ, బయట జగన్‌పై ఒంటికాలుపై దూసుకెళ్లడం, వైసీపీ నేతలకు వారి భాషలోనే సమాధానం చెప్పడంలో చింతమనేని దిట్ట. ఈ దూకుడే ఆయనకు ప్రజాభిమానం తెచ్చిపెట్టినా....పార్టీకి కొంత ఇబ్బందికర పరిస్థితులనూ తెచ్చిపెట్టాయి. దీంతో ఈసారి ఆయనకు కాకుండా ఆయన కుటుంబ సభ్యులకు టిక్కెట్ ఇవ్వాలని మొదటి భావించారు. అందులో భాగంగానే చింతమనేని ప్రభాకర్ కుమార్తె పేరిట ఐవీఆర్ఎస్( సర్వే సైతం నిర్వహించారు. అయితే ఎక్కువ మంది చింతమనేని ప్రభాకర్ ఉంటేనే బాగుంటుందని చెప్పడంతో....అధిష్టానం ఆయన వైపే మొగ్గు చూపింది. రెండో జాబితాలో చంద్రబాబు 34 స్థానాలకు అభ్యర్థుల్ని ప్రకటించారు. మొదటి జాబితాలో జనసేనతో ఉమ్మడి జాబితా ప్రకటించిన టీడీపీ, ఇప్పుడు సపరేట్ గా రెండో జాబితాను విడుదల చేసింది. మొదటి జాబితాలో 94మంది అభ్యర్థులను ప్రకటించిన బాబు రెండో జాబితాలో 34 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. ఇంకా 14 అసెంబ్లీ, 17 ఎంపీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంది.

# మడత పెట్టి పక్కన పెట్టేశారు..

హైదరాబాద్, మార్చి 15, తొమ్మిదేళు తెలంగాణ రాష్ట్రాన్ని పాలించిన గులాబీ పార్టీ జాతీయ పార్టీగా అవతరించింది. అయితే గత ఎన్నికల ఫలితాలతో డీలా పడింది. జాతీయ పార్టీ మాట దేముడెరుగు.. సొంత రాష్ట్రంలో మనుగడ కోసం ప్రయత్నాలు చేయాల్సిన పరిస్థితి కనిపిస్తుందంటే ఎంతలో ఎంత డీలా పడిపోయింది? అని ప్రత్యేకంగా వేరే చెప్పాల్సిన పనిలేదు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఏర్పడిన ఉద్యమ సంస్థగా తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పాటయింది. టీఆర్ఎస్ గా తెలంగాణ ప్రజల నోళ్లలో నానింది. కారు గుర్తును ఒకటి కాదు.. రెండు సార్లు గెలిపించి కేసీఆర్ ను ముఖ్యమంత్రిని చేశారు జనం. తెలంగాణ రాష్ట్రం ఆయన వల్లనే సాధ్యమయిందన్న నమ్మకంతోనే జనం గులాబీ పార్టీ వైపు మొగ్గుచూపారు. ఎవరు చెప్పారో.. తెలీదు.. పేరు మారిస్తే మూడోసారి విజయం ఖాయమని చెప్పారేమో కూడా తెలియదు. కేసీఆర్ మస్తిష్కంలో పుట్టిన ఆలోచన అని కూడా చెప్పలేం. ఇలా కారణాలేవైనా టీఆర్ఎస్ ను ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ గా మార్చి పడేశాడు పెద్దాయన. తనను తప్ప మరెవ్వరినీ ప్రజలు ఆదరించరన్న ధైర్యం కావచ్చు. అందుకే టీఆర్ఎస్‌ను జాతీయ పార్టీగా తీర్చాలని, దేశాన్ని ఉద్ధరించాలని కారు వేసుకుని బయలుదేరారు సారు. ప్రధానంగా ఒడిశా, మహారాష్ట్రలపైనే ఆయన ఎక్కువ దృష్టి పెట్టారు. తెలంగాణ సరిహద్దు రాష్ట్రాలపైన కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ లలో పార్టీ బలోపేతానికి పెద్దగా ప్రయత్నించలేదనే చెప్పాల్సి ఉంటుంది. అయితే మొన్నటి ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి పాలయింది. ఆ తర్వాత పరిస్థితులు వేగంగా మారాయి. గతంలో పొత్తుల ఊసే ఎత్తని కేసీఆర్ ఈసారి తెలంగాణలో ఎక్కువ స్థానాలను సొంతం చేసుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. కమ్యునిస్టులతో ఉప ఎన్నికల్లో పొత్తును పెట్టుకున్న కేసీఆర్ సాధారణ ఎన్నికల్లో మాత్రం ఒంటరిగానే బరిలోకి దిగారు. గేరు మార్చుదామనుకున్న గులాబీ బాస్ కు ఫస్ట్ గేర్ నుంచి ముందుకు పడలేదు. దీంతో కేసీఆర్ అధికారానికి దూరంగా ఉండిపోవాల్సి వచ్చింది. అయితే ఇప్పుడు లోక్‌సభ ఎన్నికలు దగ్గరపడుతున్న సమయంలో ఆయన బీఆర్ఎస్ ను ఏ ఏ రాష్ట్రాల్లో పోట ?చేయించాలన్న దానిపై ఇంత వరకూ స్పష్టత రాలేదు. మహారాష్ట్రలో చాలా సభలు పెట్టి హడావిడి చేసిన కేసీఆర్ ఫలితాల తర్వాత అటువైపు చూడటం మానేశారు. దీంతో కేసీఆర్ కు మహారాష్ట్ర బీఆర్ఎస్ నేతలు తమ పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. తాము పోటీ చేయాలా? వద్దా? చెప్పాలంటూ వారు అల్టిమేటం ఇస్తున్నారు. బీఆర్ఎస్ వద్ద నిధులు పుష్కలంగా ఉన్నాయి. నిధుల కొరత లేకపోవడంతో పోటీ చేసి తాము కూడా రాజకీయాల్లో సత్తా చాటాలని భావించి అధికారంలో ఉన్నప్పుడు పార్టీలో చేరిన నేతలు ఇప్పుడు డైలమాలో పడ్డారు. ఒడిశా బీఆర్ఎస్ పార్టీలో కీలక నేతలందరూ రాజీనామా చేసేశారు. ఏపీలోనూ అంతే పరిస్థితి. ఇక మహారాష్ట్రలో కూడా తమ సంగతి ఏందో చెప్పాలంటూ నిలదీయడం ప్రారంభమయింది. మరి జాతీయ పార్టీగా ప్రకటించుకున్న కేసీఆర్ ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో ఏ ఏ రాష్ట్రాల్లో పోటీ చేస్తారు? కేవలం తెలంగాణకు మాత్రవే పరిమితమవుతారా? అన్నది మరికొద్ది రోజుల్లోనే తెలియనుంది.

# సతి కోసం పతి...

మెదక్, మార్చి 15 మెదక్ పార్లమెంట్ పరిధిలోని కాంగ్రెస్ పార్టీలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. మొన్నటి వరకు సైలెంట్?గా ఉన్న జగ్గారెడ్డి ఇప్పుడు సడన్?గా మెదక్ ఎంపీ సీట్ తన భార్య నిర్మలా జగ్గారెడ్డికి ఇవ్వాలని అధిష్టానంను కోరారట. ఇదే విషయంపై నిర్మలా జగ్గారెడ్డి కూడా గాంధీభవన్‌లో మీడియా సమావేశం పెట్టి మరి తన మనసులో మాట చెప్పేశారు. ప్రస్తుతం నిర్మలా జగ్గరెడ్డి సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా ఉన్నారు. ఇప్పుడు ఆమె పేరు ఆశావహుల లిస్ట్?లోకి వచ్చి చేరడంతో ఇప్పుడు చర్చ మొత్తం ఆమెకు ఎంపీ సీట్ వస్తుందా లేదా అనే దానికంటే ఆమె తరపున జగ్గరెడ్డి ప్రచారానికి వస్తాడా లేదా అనే టాపిక్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇలా చర్చకు దారి తీసింది జగ్గారెడ్డినే అని అంటున్నారు స్థానిక పార్టీ నేతలు. గత ఎమ్మెల్యే ఎన్నికల్లో సంగారెడ్డి నుండి పోటీ చేసి ఓటమి పాలు అయ్యాక జగ్గారెడ్డి మొత్తం హైదరాబాద్?కే పరిమితం అయ్యారు.ఇక సంగారెడ్డి నియోజకవర్గనికి రాను అని నేరుగా మీడియా ముందే చెప్పేసారు.

తాను నియోజకవర్గ పరిధిలోకి రాను కానీ, కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తాను అని చెప్పారు. అలా చెప్పి మొత్తం హైదరాబాద్?లోనే ఉంటూ నిత్యం సోషల్ మీడి యాలో క్రియాశీలకంగా ఉండేలా ప్రణాళికలు రచిస్తున్నారు. ఇక ఎంపీ ఎన్నికల్లో సైతం తాను పోటీ చేయను అని చాలా సార్లు చెప్పారు జగ్గారెడ్డి. అసలు ఎంపీ ఎన్నికలపై పెద్ద ఇంట్రెస్ట్ లేదన్నట్లే పలుమార్లు మాట్లాడారు. కానీ ఏం జరిగిందో తెలీదు కానీ సడన్ గా మెదక్ ఎంపీ టికెట్ తన భార్యకు ఇవ్వాలని ఇటీవలే అధిష్టానం పెద్దలను కలిశారు జగ్గరెడ్డి. పార్టీ కోసం ఎన్నో త్యాగాలు చేసాం అని, ఈ సారి ఎంపీ టికెట్ తన భార్య నిర్మాల జగ్గారెడ్డికి ఇవ్వాలని కొరారు. ఇప్పటి వరకు బాగానే ఉంది కానీ, ఎమ్మెల్యే ఎన్నికల్లో ఓటమి పాలు కాగానే నియోజకవర్గంపై కోపం పెట్టుకొని, అసలు ఇక నియోజకవర్గానికే రాను అని తెగేసి చెప్పిన జగ్గరెడ్డి ఇప్పుడు మళ్లీ నియోజకవర్గంకి వస్తారా.. రారా అనే చర్చ నియోజకవర్గ వ్యాప్తంగా మొదలైంది. ఒకవేళ మెదక్ ఎంపీ టికెట్?ను కాంగ్రెస్ అధిష్టానం నిర్మలా జగ్గారెడ్డికి ఇస్తే, జగ్గారెడ్డి ఆమె తరపున ప్రచారం చేయాలంటే నియోజకవర్గానికి రావాల్సిందే. మరి ఆయా నేమో ఇది ఏది ఆలోచిం చకుండా నియోజకవర్గానికి రాను అని చెప్పారు. ఇప్పుడు దీన్ని ఎలా కవర్ చేస్తారో అనే ఆసక్తి క్యాడర్లో మొదలైంది. మరి జగ్గారెడ్డి చెప్పిన మాట మీద ఉంటారా.. ఆయన స్టైల్లో అప్పుడు ఏదో డైలాగ్?లో పవర్ కోసం ఆపదాలు వాడను అని సింపుల్ గాచెప్పేస్తారాఅనేదివేచి చూడాలి.

## అన్నదమ్ములను కలిపిన ఎన్నికలు

కొత్తపేట వారిద్దరూ తోడబుట్టిన అన్నదమ్ములు... కానీ పార్టీలు వేరు.. అన్న తెలుగుదేశం... తమ్ముడు జనసేన.. వారే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం చెందిన తెలుగుదేశం పార్టీ నేత బండారు సత్యానందరావు, జనసేన నేత బండారు శ్రీనివాస్.ఇద్దరు టికెట్ కోసం ప్రయత్నించారు.. గత ఎన్నికల్లో ప్రత్యర్థులుగా పోటీ చేశారు.. అయితే ఈసారి ఎన్నికల్లో పొత్తు ధర్మం ప్రకారం తెలుగుదేశం పార్టీకి కొత్తపేట సీటు ఖరారు చేసి అన్న బండారు సత్యానందరావుని అభ్యర్థిగా ప్రకటించారు. అయితే జనసేన నేత శ్రీనివాస్ దీంతో కంగుతిన్నారు... అన్నదమ్ముల మధ్య పరస్పర వివాదం ... ఆరోపణ ప్రత్యారోపణలు చేసుకున్నా ఈసారి ఎన్నికల్లో ఒకటయ్యారు.. పొత్తు ధర్మం పాటించి అన్న సత్యానందరావు విజయానికి తమ్ముడు శ్రీనివాస్ కంకణం కట్టుకున్నారు. ఎన్నికల ధర్మం అంటూ అన్నదమ్ములు ఇద్దరు ఒక్కటే అయ్యారు.

# అడ్డగోలుగా గంజాయి విక్రయాలు...

హైదరాబాద్, మార్చి 15 రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలను పూర్తిగా నివారించేందుకు కఠిన చర్యలు చేపట్టాలని పోలీసులకు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలిచ్చింది. ఈ మేరకు పోలీసులు సైతం ఎక్కడికక్కడ సోదాలు నిర్వహించి గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపుతున్నారు. అయితే, తాజాగా నానక్ రాంగూడాలో గంజాయి విక్రయాలు కలకలం రేపాయి. ఓ మహిళ గంజాయిని బహిరంగంగానే విక్రయిస్తుండడాన్ని గుర్తించిన పోలీసులు షాకయ్యారు. ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి పక్కా ప్రణాళికతో ఆమెతో సహా కొనుగోలు చేస్తున్న అందరినీ కటాకటాల్లోకి నెట్టారు. అయితే, ఆమె ఏళ్ల తరబడి ఈ దందా సాగిస్తుండడం గమనార్హం. పోలీసుల విచారణలో విస్తుపోయే నిజాలు వెలుగుచూశాయి. రాష్ట్రంలో మత్తు పదార్థాల కట్టడికి ఏర్పాటైన తెలంగాణ నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో (టీన్యాబ్) డైరెక్టర్ సందీప్ శాండిల్య డ్రగ్స్ కు సంబంధించిన సమాచారంపై తరచూ రాష్ట్రంలో అందరి పోలీసులనూ అప్రమత్తం చేస్తున్నారు. ఈ క్రమంలో సిద్ధిపేట కమిషనరేట్ పోలీసులకు మత్తు పదార్థాల విక్రయంపై కొంత సమాచారం అందింది. ఇటీవలే ములుగు ప్రాంతంలో చిక్కిన ఇద్దరు గంజాయి విక్రేతలను విచారించగా తాము నానక్ రాంగూడలో తెచ్చామని పోలీసులకు తెలిపారు. దీంతో నిజానిజాలు తెలుసుకునేందుకు సిద్ధిపేట కమిషనర్ అనూరాధ ఓ బృందాన్ని అక్కడికి పంపారు. రహస్యంగా అక్కడకు వెళ్లిన పోలీసులు.. గంజాయి కొనేందుకు ఓ పెద్ద క్యూనే ఉండడం చూసి ఆశ్చర్యపోయారు. బహిరంగంగానే గంజాయి విక్రయాలు చేపట్టగా.. పదిహేను మంది క్యూలో నిలబడ్డారు. నీతూబాయి అనే మహిళ ఎలాంటి జంకూ గొంకూ లేకుండా గంజాయిని బహిరంగంగానే విక్రయిస్తుండడం చూసిన పోలీసులు షాకయ్యారు. గంజాయి కొనేందుకు ఉన్న క్యూలోనే పోలీసులు నిలబడి రూ.5 వేల గంజాయి కావాలని అడిగారు. ఆమె ఏమాత్రం భయం లేకుండా సరుకు ఇవ్వడంతో అక్కడి నుంచి వెనుదిరిగారు. ప్రత్యేక బృందం అందించిన సమాచారాన్ని కమిషనర్ అనురాధ.. సందీప్ శాండిల్యకు వివరించారు. గంజాయి విక్రేత నీతుబాయిని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకునేందుకు సందీప్ శాండిల్య ఆధ్వర్యంలో పోలీసుల బృందం ప్రత్యేక ఆపరేషన్ చేపట్టింది. సైబరాబాద్ కమిషనర్ అవినాశ్ మహంతి సహకారంతో బృందాన్ని ఏర్పాటు చేసి నీతూబాయి ఇంటికి పంపారు. ఆమె ఇంటి లోపలికి వెళ్లేందుకు నాలుగు అంచెల్లో గ్రిల్స్ ఉన్నాయని.. ఒకవేళ పోలీసులు గ్రిల్స్ తొలగించుకుని వెళ్తే గంజాయిని మ్యాన్ హోల్ లో పడేసి తప్పించుకునే అవకాశం ఉందని.. సిద్ధిపేట పోలీసులు చెప్పడంతో అందుకు అనుగుణంగా ప్రణాళిక రచించారు.

ఈ క్రమంలో తమ వెంట ఇద్దరు స్వీపర్లను తీసుకెళ్లారు. గ్రిల్స్ తొలగించే లోపు మ్యాన్ హోల్ ను బ్లాక్ చేసి గంజాయి కొట్టుకుపోకుండా సీజ్ చేయాలనేదే ప్లాన్. ఈ క్రమంలోనే పోలీసుల బృందం అక్కడకు వెళ్లింది. అప్పటికే అక్కడ 10 మంది గంజాయి కొనుగోలు చేస్తూ కనిపించారు. దీంతో రెడ్ హ్యాండెడ్ గానే నీతుబాయితో పాటు అందరినీ అరెస్ట్ చేశారు. ఆమె ఇంట్లో భారీగా గంజాయితో పాటు రూ.16 లక్షల నగదు సీజ్ చేశారు.కాగా, నిందితురాలు నీతుబాయిపై తొలుత 2017లో శేరిలింగంపల్లి ఎక్సైజ్ విభాగం కేసు నమోదు చేసింది. అనంతరం 2021 సెప్టెంబర్ వరకూ ఆమెపై 12 కేసులు నమోదు కావడంతో పీడీ చట్టం ప్రయోగించారు. ఏడాది అనంతరం జైలు నుంచి తిరిగి వచ్చిన 2 నెలలకే మళ్లీ గంజాయి విక్రయిస్తూ పోలీసులకు చిక్కింది. అలా గత అక్టోబర్ వరకూ మరో 6 కేసులు.. మొత్తం 18 కేసులు నిందితురాలిపై నమోదయ్యాయి. తాజాగా మరోసారి నీతూబాయిపై పీడీ చట్టం ప్రయోగించేందుకు పోలీసులు నివేదిక రూపొందించారు.నిందితురాలుమరోవైపు, సైబరాబాద్ పరిధిలో గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. జీడిమెట్లలో బీహార్ కు చెందిన శిబుకుమార్ అనే యువకుడు కిరాణా దుకాణంలో గంజాయి చాక్లెట్లు అమ్ముతున్నట్లు గుర్తించిన పోలీసులు దాడి చేసి నిందితున్ని అరెస్ట్ చేశారు. నిందితుని వద్ద రూ.11,500 విలువైన 150 గంజాయి చాక్లెట్స్ స్వాధీనం చేసుకున్నారు. వీటిని ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వలస కూలీలకు అమ్ముతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఏళ్ల తరబడి మహిళ మత్తు దందా, పోలీసుల ప్రత్యేక ఆపరేషన్ తో కటాకటాల్లోకి నిందితురాలుఅటు, రామచంద్రాపురం బాలాజీనగర్ లోని బీహార్ కు చెందిన సీతారామ్ సింగ్ అనే 60 ఏళ్ల వృద్ధుడు గంజాయి చాక్లెట్స్ విక్రయిస్తున్నట్లు గుర్తించి మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుని వద్ద నుంచి రూ.30 వేల విలువైన గంజాయి చాక్లెట్స్ స్వాధీనం చేసుకున్నారు. అలాగే, నిజాంపేట్ లోని పాన్ షాపులపై దాడి చేసి నిషేధిత సిగరెట్స్ పట్టుకున్నారు. నిందితులు చంద్రశేఖర్, బాలరాజ్ లను అరెస్ట్ చేశారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఏపీ కాంగ్రెస్ కు రేవంత్ ఊపిరి పోస్తారా

విశాఖపట్టణం, మార్చి చ15, రాష్ట్ర విభజన తర్వాత నవ్యాంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు గడ్డు పరిస్థితి ఏర్పడింది. పదేళ్లపాటు అధికారానికి, ప్రజలకు దూరమైంది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ కొంచెం పుంజుకోవచ్చని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. అయితే అది సీట్ల దాకా వెళ్తుందని ఎవరూ చెప్పడం లేదు. కాకపోతే గతంలో ఓట్ల శాతాన్ని పెంచుకునే అవకాశం ఉంది. ఎంత పెంచుకుంటందనేదాన్ని బట్టే కాంగ్రెస్ భవిష్యత్ ఆధారపడి ఉంటుందని అనుకోవచ్చు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తిరిగి పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పీసీసీ చీఫ్ షర్మిల కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగానే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఏపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. పదహారో తేదీన విశాఖలో బహిరం గసభలో ప్రసంగించ నున్నారు. ఆంధ్రప్రదేశ్ అంటే కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అన్న పేరు ఉండేది.కాంగ్రెస్‌ను అమితంగా ఆదరించిన ఆంధ్రప్రదేశ్ ప్రజలు రాష్ట్ర విభజన తర్వాత దూరం పెట్టారు. విభజన కన్నా ఎ?కకువగా జగన్మోహన్ రెడ్డి సొంత పార్టీ పెట్టుకోవడం కాంగ్రెస్ పార్టీకి ఎక్కువ నష్టం చేసింది. క్యాడర్ అంతా ఆ పార్టీకి వెళ్లిపోవడంతో కాంగ్రెస్ నిర్వీర్యం అయిపో యింది. నవ్యాంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు ఇప్పుడు ఉనికిని కాపాడుకోవడమే కష్టంగా మారింది. రాష్ట్ర విభజన అంశం సీమాంధ్ర ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీని తీవ్రంగా దెబ్బ కొట్టింది. మునుపెన్నడూ లేనంత స్థాయిలో ఘోరమైన పరాభవాన్ని 2014 ఎన్నికల్లో ఆ పార్టీ చవిచూసింది. నవ్యాంధ్ర రాష్ట్రంలోని మొత్తం 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ నియోజకవర్గాల్లో ఒక్క సీటు కూడా సాధించకపోగా, డిపాజిట్లు కోల్పోయింది. దీంతో పార్టీలోని ముఖ్య నేతలు అందరూ ఇతర పార్టీలకు ఒక్కరు ఒకరుగా వలస పోయారు. దీంతో కాంగ్రెస్ ఖాళీ అయింది. 2019 ఎన్నికల్లో ఆ పార్టీ పోటీ చేసిందా లేదా అన్నది కూడా ఎవరూ పట్టించుకోలేదు. షర్మిల తెలంగాణలో పార్టీ పెట్టుకున్నారు. కానీ అక్కడ పరిస్థితిలు అంత సానుకూలంగా కనిపించకపోవడంతో కాంగ్రెస్ లో విలీనం చేయాలనుకున్నారు. కానీ ఆమెను తెలంగాణ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించడానికి కాంగ్రెస్ నేతలు అంగీకరించలేదు. ఆమె వల్ల పార్టీ నష్టపోతుందని.. ఆమెకు ఏపీ కాంగ్రెస్ బాధ్యతలు ఇవ్వాలన్నారు. ఆ ప్రకారం.. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు పూర్తయిన తర్వాత కాంగ్రెస్‌లో చేరిపోయారు షర్మిల. కొద్దిరోజులకే ఏపీ పీసీసీ చీఫ్ గా ప్రకటించడంతో రంగంలోకి దిగారు. వరుసగా పర్యటనలు చేస్తున్నరు. దీంతో మళ్లీ కాంగ్రెస్ పుంజుకుంటుందని ఆశ పడుతున్నారు.షర్మిల ఏపీ బాధ్యతలు తీసుకుంటే తాము పూర్తి స్థాయిలో సహకరిస్తామని రేవంత్ రెడ్డి కూడా హామీ ఇచ్చారు. రెండు సార్లు షర్మి రేవంత్ రెడ్డిని కలిసి.. ఏపీలో పార్టీ బలోపేతంపై చర్చించారు. పదేళ్లపాటు తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొన్న కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో నైనా పుంజుకునేందుకు తన చరిష్మాను ఉపయోగించడానికి సిద్ధమయ్యారు. ఒక్క సీట్ అయినా దక్కించుకొని ఖాతా తెరుస్తుందా అన్న సందేహాలు ?న్నప్పటికీ.. 2014తో పోల్చుకుంటే ఈ ఎన్నికల్లో తమ పార్టీ మంచి పురోగతి సాధించిందని ఆ పార్టీ నేతలు నమ్మకంతో ఉన్నారు. అభ్యర్థులు దొరకని పరిస్థితి నుంచి ఒక్కో స్థానానికి నలుగురైదుగురు అభ్యర్థులు పోటీ పడే స్థాయికి వచ్చామని. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ స్థానాలకు గాను 13 వందల దరఖాస్తులు అందాయని అంటున్నారు. రాష్ట్ర విభజన తర్వాత ప్రజల నిరాదరణకు గురై ఉనికిని కోల్పోయిన కాంగ్రెస్‌కు తిరిగి పూర్వ వైభవం దక్కుతుందా... రేవంత్, షర్మిల చరిష్మా ఎంతవరకు పనిచేస్తుంది...అన్నది చాలా మందికి అంతుబట్టనివిషయం . తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి విశాఖ పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ నెల 16న విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రాంగణంలో జరిగే మహాసభలో రేవంత్ రెడ్డి పాల్గొనున్నారు. ఈ వేదిక. సాక్షిగా అధికార ప్రతిపక్ష పార్టీలను ఎండగట్టనున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ, వాల్తేరు రైల్వే జోన్, రాష్ట్రానికి ప్రత్యేక హోదా అంశాలను ఎన్నికల ప్రచారాస్త్రాలుగా కాంగ్రెస్ పార్టీ ఎంచుకుంది. ఇప్పటికే పీసీసీ చీఫ్ షర్మిల విమర్శనాస్త్రాలతో ప్రతిపక్షాలపై విరుచుకుపడుతున్నారు. రేవంత్ రెడ్డికి ఏపీలోనూ మంచి ఆదరణ ఉంది. ఆయన దూకుడు రాజకీయానికి అభిమానులు ఉన్నారు. అయితే ఓట్లు తెచ్చి పెడ`తాయా అన్నది తేలాల్సి ఉంది.

# ఆగిపోయిన ఇంటర్ సిటీ ఎక్స్ ప్రెస్

హనుమకొండ జిల్లా హసన్ పర్తి సమీపంలో ఇంటర్ సిటీ ఎక్స్ ప్రెస్ నిలిచిపోయింది. ఇంజన్ ఫెయిల్ అవడమే కారణం. హైదరాబాద్ నుండి కాగజ్ నగర్ వెళ్తున్న ఇంటర్సిటీ ఎక్స్ ప్రెస్, గంటకు పైగా రైలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో ఇంజన్ అమర్చేందుకు రైల్వే అధికారులు ప్రయత్నాలు చేసారు. ఆ మార్గంలో వెళ్లే పలు రైళ్ల పొకలకు అంతరాయం కలిగింది. సింగరేణి ట్రైన్ ను ఆపుకొని ఎక్కి వెళ్లారు.

## పార్టీ మార్పు కథనాలపై యమమల స్పందన

తు కొన్ని మీడియా ఛానల్స్ లో వచ్చిన కథనాల పై యనమల కృష్ణుడు స్పందించారు. తాను పార్టీ మాడుతున్నట్లు వస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దు. ఎమ్మెల్యేగా గెలవకపోయినా తుని నియోజకవర్గ ప్రజలకు సేవ చేసుకునే అదృష్టం నాకు కలిగింది. నేను ఏ పార్టీలో కీ వెళ్లడం లేదు నా పై వస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు ఎవరు నమ్మవద్దు. నేను తెలుగుదేశం పార్టీలోనే కొనసాగుతాను. మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు కీ వెంటే వుంట.. తుని నియోజకవర్గ తెలుగదేశం పార్టీ గెలుపుకు కృషిచేస్తానని అన్నారు.

# ఎమ్మెల్యే సోదరుడు అరెస్టు



సంగారెడ్డి పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసారు. సంతోష్ సాండ్ అండ్ గ్రానైట్స్ ను నిబంధనలకు విరుద్ధంగా నడిపాడనే కారణంతో అయనను పటాన్ చెరు పోలీసులు అరెస్టు చేసారు.శుక్రవారం తెల్లవారుజామునే గూడెం మధు ఇంటికి చేరుకున్న పోలీసులు, అయననుఅదుపులో తీసుకుని పటాన్ చెరు పోలీస్ స్టేషన్ కు తరలించారు.

# కాంగ్రెస్ జోరు... కారు బేజారు

హైదరాబాద్, మార్చి 15, కల్వకుంట్ల చంద్రశేఖరరావు.. తెలంగాణ యాస, బాస పేర ప్రత్యర్థులపై ఉచితానుచితాలు పట్టించుకోకుండా విమర్శల పేరిట దూషణలతో విరుచుకు పడిపోయే వారు. ఎప్పుడైతే తెలంగాణ ఉద్యమ సారథ్య బాధ్యతలు చేపట్టారో అప్పటి నుంచీ కేసీఆర్ ది అదే శైలి. ఇక రాష్ట్ర విభజన తరువాత 2014 ఎన్నికలలో విజయం సాధించి తెలంగాణ ముఖ్యమంత్రిగా పగ్గాలు అందుకున్న తరువాత నుంచి రేవంత్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయారు. కేసీఆర్ భాషలోనే విమర్శలు గుప్పించడానికి ఇసుమంతైనా వెనుకాడటం లేదు. ఇప్పటి వరకూ ప్రత్యర్థులు నోరెత్తకుండా తనకే ప్రత్యేకమైన భాష, యాసలో విరుచుకుపడి ఎదురే లేదన్నట్లుగా వ్యవహరించిన కేసీఆర్ నే డిఫెన్స్ లో పడేసేంత స్థాయిలో రేవంత్ రెడ్డి దూకుడు పెంచారు. గతంలో ఈ పరిస్థితి ఉండేది కాదు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆ ఉద్యమ సారథిగా కేసీఆర్ తన ఫస్ట్ టార్గెట్ గా తెలుగుదేశం పార్టీని ఎంచుకున్నారు. రెండు రాష్ట్రాలకూ న్యాయం అన్న చంద్రబాబు మాటలను కాయిన్ చేసి రెండు కళ్ల సిద్ధాంతం అంటూ తనదైన భాషలో చంద్రబాబుపై విమర్శలు గుప్పించారు. అయితే చంద్రబాబు మాత్రం ఎన్నడూ రాజకీయ మర్యాదలకు తిలోదకాలిచ్చి మాట్లాడింది లేదు. ఆయన ఎప్పుడూ పరిధి దాటరు. తీవ్ర ఆగ్రహం వస్తే ఏం తమాషా చేస్తున్నారా అన్నది మాత్రమే ఆయన నోటి వెంట వచ్చే మాట. ఉద్యమ ఊపులో అప్పట్లో కేసీఆర్ భాషకు, యాసకు తెలంగాణ జనం నుంచి మంచి స్పందన వచ్చింది. అదే సమయంలో చంద్రబాబు శైలి ప్రస్తుత రాజకీయాలకు సరిపడదనీ, ఆయనది ఔట్ డేటెడ్ స్టైల్ అనీ అప్పట్లో సొంత పార్టీ వారే అన్న సందర్భాలు ఉన్నాయి. అయినా చంద్రబాబు తన స్టైల్ మార్చుకోలేదు. అదే ఆయన బలం అని ఆ తరువాత పలు సందర్భాలలో రుజువైంది అది వేరే సంగతి.ఇక వైఎస్ రాజశేఖరరెడ్డి అకాల మరణం తరువాత ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రులుగా ఉన్న కొణిజేటి రోశయ్య కానీ, ఆ తరువాత నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి కానీ, కేసీఆర్ వాగ్ధాటి ముందు నిలువలేకపోయారు. సరే రాష్ట్ర విభజన తరువాత కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టారు. కాంగ్రెస్ సారథ్య బాధ్యతలు చేపట్టిన పొన్నాల లక్ష్మయ్య, ఆయన తరువాత ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా కేసీఆర్ విమర్శల జడిలో తడిసి ముద్దయ్యారు. దీటుగా బదులివ్వడంలో విఫలమయ్యారు. కానీ రేవంత్ కాంగ్రెస్ రాష్ట్ర పగ్గాలు చేపట్టిన తరవాత పరిస్థితి పూర్తిగా మారింది. కేసీఆర్ కు దీటుగా ఆయన భాషలోనే బదులివ్వడం ద్వారా రేవంత్ పార్టీ శ్రేణుల్లో కూడా జోష్ నింపగలిగారు. సరే ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలలో బీఆర్ఎస్ పరాజయం పాలైంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. రేవంత్ ముఖ్యమంత్రి అయ్యారు. పదేళ్ల పాటు ఇష్టారాజ్యంగా వ్యవహరించిన బీఆర్ఎస్ సర్కార్ తప్పిదాలు ఒక్కటొక్కటిగా బయటకు వస్తున్నాయి. వాటి ఆధారంగా కేసీఆర్ లక్ష్యంగా రేవంత్ తన విమర్శలకు పదునుపెట్టడంతో కేసీఆర్ పూర్తిగా డిఫెన్స్ లో పడిపోయారు. గతంలో తన ధోరణి, ప్రత్యర్థి పార్టీల నేతలపై ఉపయోగించిన భాష అన్ని కన్వీనియెంట్ గా మరచిపోయి.. కరీంనగర్ సభలో ఒక మాజీ ముఖ్యమంత్రిని ఉద్దేశించి మాట్లాడాల్సిన భాషేనా అది అంటూ అమాయకంగా ప్రశ్నించారు. రేవంత్ కనీస మర్యాద కూడా లేకుండా వ్యవహరిస్తున్నారనీ, తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఎన్నడైనా ఇటువంటి అనుచిత భాష ఏపయోగించానా అంటూ వ్యాఖ్యలు చేశారు. వెంటనే కాంగ్రెస్ అలర్ట్ అయి గతంలో కేసీఆర్ అనుచిత భాషా ప్రయోగంతో చేసిన ప్రసంగాల వీడియోలను సామాజిక మాధ్యమంలో విస్తృతంగా ప్రచారంలోకి తీసుకు వచ్చింది. అవి వెంటనే వైరల్ అయిపోతున్నాయి. దీంతో కేసీఆర్ అనివార్యంగా మౌనం వహించాల్సివచ్చింది. మొత్తం మీద కేసీఆర్ భాషనే ఆయనమీద ప్రయోగించి రేవంత్ పై చేయి సాధించారని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

# స్థానికులపై అవంతి చిందులు

భీమిలి నియోజకవర్గం ప్రజలపై మాజీ మంత్రి అవంతి చిందులు వేసారు. పద్మనాభం మండలం తుని వలస గ్రామంలో డ్రైనేజ్ సమస్యపై మాజీ మంత్రిని గ్రామస్తులు నిలదీసారు. పొంతన లేని సమాధానాలతో ప్రజల్ని అవంతి భయపెడుతున్న వారు ఆరోపించారు. మహిళలని ఏక వచనంతో సంబోధిస్తూ తన అహంకారాన్ని చాటుకున్నడని మండిపడ్డారు. సీటు లేదు, గెలవను లేదు, అప్పుడే ఇంత అహంకారం ఏంటని నిలదీసారు.




# క్రీడలు

## మరోసారి రిపీట్ అవుతున్న హిట్ కాంబినేషన్..!



నటసింహం నందమూరి బాలకృష్ణ ప్రస్తుతం బాబీ దర్శకత్వంలో ఒక సినిమా చేస్తున్న సంగతి మనందరికీ తెలిసిందే. కాగా ఈ సినిమా నందమూరి బాలకృష్ణ కెరియర్ లో 109వ సినిమా గా రాబోతోంది. స్టైలిష్ యాక్షన్ ఎంటర్టైనర్ గా వస్తున్న ఈ సినిమాలో నందమూరి బాలకృష్ణ సరికొత్తగా కనిపించబోతున్నట్లుగా కూడా వార్తలు వినబడుతున్నాయి. ఇక ఇప్పటివరకు విడుదలైన పోస్టర్లు అన్నీ కూడా ఈ సినిమాపై అంచనాలను భారీగా పెంచేస్తున్నాయి. కాగా నందమూరి బాలకృష్ణ నటిస్తున్న ఈ సినిమాను సితార ఎంటర్టైన్మెంట్స్ నిర్మిస్తోంది. దాంతోపాటు నిర్మాణంలో త్రివిక్రమ్ సొంత సంస్థ ఫార్చ్యూన్ ఫోర్ ఎంటర్టైన్మెంట్ సైతం పార్ట్నర్ గా ఉన్నారు. అయితే ఈ సినిమా తరువాత నటసింహం నందమూరి బాలకృష్ణ తన 110 సినిమా అని కూడా లైన్లో పెట్టినట్లుగా తెలుస్తోంది. ప్రముఖ మాస్ డైరెక్టర్ బోయపాటి శ్రీను దర్శకత్వంలో కూడా నందమూరి బాలకృష్ణ ఒక సినిమా చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లుగా తెలుస్తోంది. ఇప్పటికే చాలా డైరెక్టర్ల పేర్లు వినిపించినప్పటి కీ బోయపాటి తో సినిమాకి నటసింహం నందమూరి బాలకృష్ణ ఓకే చేసినట్లుగా సమాచారం. ప్రస్తుతం ఏపీ రాజకీయ హడావిడిలోనే నటసింహం నందమూరి బాలకృష్ణ ఎక్కువగా బిజీ అవుతున్నారు. కాబట్టి స్టోరీల గురించి చర్చించి నిర్ణయాలు తీసుకునేంత సమయం కూడా దొరకడం లేదు. వీలైనంత తొందరగా బాబి సినిమాను తొందరగా పూర్తి చెయ్యాలనే ఆలోచనలో ఉన్నారు నటసింహం నందమూరి బాలకృష్ణ .. బోయపాటి శ్రీను కాంబోలో తదుపరి సినిమాను చేయబోతున్నాడు.. బోయపాటి పూర్తిస్థాయిలో స్క్రిప్ట్ సిద్ధం చేసుకున్నట్లుగా తెలుస్తోంది. బాలయ్య కోరిక మేరకు కొన్ని మార్పులు కూడా ప్రస్తుతం జరుగుతున్నట్లు సమాచారం.

## నిహారికకు షాక్ ఇచ్చిన ఏపీ ప్రభుత్వం..!

మెగా డాక్టర్ గా ఇండస్ట్రీలో పేరుపొందిన నిహారిక గురించి చెప్పాల్సిన పనిలేదు.. నిత్యం ఈమె గురించి ఏదో విధంగా సోషల్ మీడియాలో పేరు వినిపిస్తూనే ఉంటుంది..మొదట యాంకర్ గా తన ప్రయాణం మొదలుపెట్టి అనంతరం హీరోయిన్గా ఇండస్ట్రీలో ఎన్నో చిత్రాలలో నటించింది.. ఇక పోతే నిహారిక ప్రస్తుతం తన భర్త నుంచి విడాకులు తీసుకుని నిర్మాతగా నటిగా మళ్లీ ఇండస్ట్రీలో కొనసాగాలని ప్రయత్నాలు చేస్తూనే ఉంది. మెగా ఫ్యామిలీ నుంచి వచ్చిన అమ్మాయి కావడం చేత అవకాశాలు బాగానే వస్తున్నాయి. ఇటీవల కాలంలో మెగా కుటుంబ సభ్యులు ఏ ఇంటర్వ్యూలో మాట్లాడిన కూడా రాజకీయాలకు సంబంధించిన విషయాల పైన కూడా మాట్లాడుతున్నారు. పవన్ కళ్యాణ్ ప్రస్తుతం జనసేన పార్టీని స్థాపించి రాజకీయాలలో ఉన్నారు. అంతేకాకుండా ఈయన వెంట నాగబాబు కూడా రాజకీయాలలో పాల్గొనడంతో మెగా హీరోలకు తప్పనిసరిగా రాజకీయాల గురించి ప్రశ్నలు ఎదురవుతున్నాయి. ఈ క్రమంలోనే నిహారిక బాబాయ్ పొలిటికల్ గురించి పలు రకాల ప్రశ్నలు ఎదురవగా తన బాబాయ్ పొలిటికల్ గురించి మీ అభిప్రాయం ఏంటి అని యాంకర్ అడగగా.. ఈసారి కచ్చితంగా జనసేన పార్టీ గెలవాలని ఆ దేవుడిని కోరుకుంటున్నాను అంటూ వెల్లడించింది. తన ఓటు కూడా ఆంధ్రాలోనే ఉండేది.. కానీ ఇప్పుడు రద్దయిందని కారణాలు ఏంటో మాత్రం తెలియలేదని వెల్లడించింది..ఆంధ్రాలో మేము ఒక ఇంటిని కూడా కొనుక్కోవాలని ప్రయత్నాలు చేస్తున్నాము.. తన తండ్రి రాజకీయాలలో బిజీగా ఉండడం చేత ఇంటికి రావడమే మానేశారని.. అలా వచ్చి ఇలా వెళుతున్నారని అందుకే ఇక్కడే ఇల్లు కొనుక్కోవాలని భావిస్తున్నట్లుగా వెల్లడించింది.



## నాని కామెంట్స్ వైరల్?



సినిమా ఇండస్ట్రీ అనే రంగుల ప్రపంచంలో గుర్తింపును సంపాదించుకోవడం అంత సులభమైన విషయం కాదు. ఇక ఏదైనా బ్యాక్ గ్రౌండ్ ఉంటేనే ఇక ఈ మాయా లోకంలో నిలబడగలం.అలాంటిది ఎలాంటి సినీ బ్యాగ్రౌండ్ లేకుండా స్వయంకృషితో ఒక్కో మెట్టు ఎదుగుతూ ఏకంగా తెలుగు ప్రేక్షకుల మెగాస్టార్ గా మారిపోయారు చిరంజీవి. ఏకంగా ఇప్పటివరకు 150 కి పైగా సినిమాల్లో నటించి తెలుగు ప్రేక్షకుల హృదయాలలో ప్రత్యేకమైన స్థానం సంపాదించుకున్నారు. ఇక ప్రస్తుతం ఆరుపదుల వయస్సు దాటిపోతున్న ఇంకా యంగ్ హీరోలకు సైతం పోటీ ఇచ్చే విధంగా వరుసగా సినిమాలు చేస్తున్నాడు.అయితే కేవలం మెగాస్టార్చిరంజీవి ఇండస్ట్రీకి హీరోగా పరిచయం కావడమే కాదు ఇక మెగా అనే ఫ్యామిలీ నుంచి దాదాపు అరడజనుకు పైగా హీరోలు ఇండస్ట్రీకి పరిచయమయ్యారు. అందరూ ఎవరికివారు ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకొని స్టార్ హీరోలుగా కొనసాగుతూ ఉన్నారు అన్న విషయం తెలిసిందే. ఇక ఇప్పుడు ఇండస్ట్రీలో టాప్ హీరోలుగా కొనసాగుతున్న వారిలో అటు రామ్ చరణ్, అల్లు అర్జున్, తేజ్ లాంటి వాళ్ళు కూడా ఉన్నారు అని చెప్పాలి. ఇక మెగా అనే బ్యాగ్రౌండ్ తోనే ఈ హీరోలు ఇండస్ట్రీకి పరిచయమై ఇక ఇప్పుడు స్టార్ హీరోలుగా ఎదిగారు. ఇలా మెగా బ్యాక్ గ్రౌండ్ తో ఇండస్ట్రీకి పరిచయమైన హీరోల గురించి న్యాచురల్ స్టార్నాని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

## 'అనన్య' అద్భుత విజయం సాధించాలి

జయరామన్, చందన, తోషి అలహరి, ప్రజ్ఞ గౌతమ్, అరవింద్, సుమన్ ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'అనన్య'. ప్రసాద్ రాజు బొమ్మిడి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని శ్రీ సిద్ధి ధాత్రి మూవీ క్రియేషన్స్ పతాకంపై జంధ్యాల ఉమా నాగ శివ గంగాధర శర్మ నిర్మించారు. హర్రర్ నేపథ్యంలో కుటుంబ ప్రేమ కథాచిత్రంగా రూపొందిన ఈ చిత్రం సెన్సార్ తో సహా అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఈనెల 22న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో "అనన్య" ప్రి రిలీజ్ వేడుకను హైద్రాబాద్ ఫిల్మ్ ఛాంబర్ లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన ప్రముఖ నటుడు సుమన్, యువ కథానాయకుడు సందీప్ మాధవ్, నిర్మాతల మండలి ప్రధాన కార్యదర్శి తుమ్మల ప్రసన్న కుమార్, ప్రముఖ నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ, ప్రముఖ దర్శకనిర్మాత సాయి వెంకట్, విశ్రాంత న్యాయమూర్తి మాల్యాద్రి, శ్రీనివాస్ బోగిరెడ్డి, యువ దర్శకుడు అఫ్జల్ తోపాటు యూనిట్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. "అనన్య" అద్భుత విజయం సాధించాలని ఈ సందర్భంగా అతిథులు అభిలషించారు. ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతాల్లో షూటింగ్ జరుపుకున్న "అనన్య" అన్ని వర్గాల ప్రేక్షకులను కచ్చితంగా అలరించి తమ "శ్రీ సిద్ధి ధాత్రి మూవీ క్రియేషన్స్"కు శుభారంభాన్నిస్తుందని నిర్మాత

## భారత క్రికెటర్ రిటైర్మెంట్ మైదానంలో భావోద్వేగం..!



టీమిండియా క్రికెటర్ ధావల్ కులకర్ణి (35) ఫస్ట్ క్లాస్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించారు. ముంబైలోని వాంఖడే స్టేడియంలో విదర్భతో జరిగిన రంజీ ట్రోఫీ ఫైనల్ అనంతరం కులకర్ణి భావోద్వేగంతో కంటితడి పెట్టారు. తన చివరి మ్యాచ్‌లో ముంబై జట్టును కులకర్ణినే విజయతీరాలకే చేర్చడం విశేషం. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.విదర్భతో జరిగిన ఫైనల్‌లో ధావల్ కులకర్ణి తొలి ఇన్నింగ్స్‌లో మూడు, రెండో ఇన్నింగ్స్‌లో ఒక్క వికెట్ తీశారు. చివరి మ్యాచ్ ఆడుతున్న కులకర్ణికి.. మ్యాచ్ ముగించాలని ముంబై కెప్టెన్ అజింక్య రహానే బంతిని అందించారు. కెప్టెన్ నమ్మకాన్ని నిలబెడుతూ.. ఉమేశ్ యాదవ్‌ను క్లీన్‌బౌల్డ్ చేసి జట్టును ఛాంపియన్‌గా నిలిపారు. అనంతరం కులకర్ణి భావోద్వేగానికి లోనయ్యారు. ఆటగాళ్లను హత్తుకొని కంటతడిపెట్టారు. ముంబైలోని ప్రతి ఆటగాడు కులకర్ణికి ఆల్ ది బెస్ట్ చెప్పారు.కులకర్ణి వీడ్కోలుపై టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ స్పందించారు. 'ముంబై యోధుడివి.. అద్భుతమైన కెరీర్' అంటూ కులకర్ణి ఫొటోతో రోహిత్ ఇన్‌స్టాగ్రామ్‌లో స్టోరీ పెట్టారు. ఫైనల్ ముగిసిన అనంతరం ధావల్ కులకర్ణి మాట్లాడుతూ.. "కెరీర్ ఆరంభాన్ని, ముగింపును అత్యున్నతంగా ముగించడం ప్రతి క్రికెటర్ కల. ముంబై తరఫున ఫైనల్ ఆడటం నాకు ఇది ఆరోసారి. అందులో అయిదు సార్లు టైటిళ్లు గెలిచాం. మ్యాచ్‌ను ముగించాలని రహానె నాకు బంతి అందివ్వడం గొప్పగా అనిపించింది. అసలు ఊహించలేదు. ఈ విషయంలో తుషార్ దేశ్‌పాండేకు కూడా థ్యాంక్స్ చెప్పాలి. తన చివరి రెండు ఓవర్లలో అతడు రెండు వికెట్లు తీసి కూడా నాకు బంతిని ఇవ్వడానికి అంగీకరించాడు" అని కులకర్ణి పేర్కొన్నారు. ధావల్ కులకర్ణి తన కెరీర్‌లో 95 ఫస్ట్ క్లాస్, 130 లిస్ట్-ఏ మ్యాచ్‌లు ఆడారు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 281 వికెట్లు, లిస్ట్-ఏ మ్యాచ్‌ల్లో 154 వికెట్లు పడగొట్టారు. మరోవైపు భారత్ తరఫున కులకర్ణి 12 వన్డేలు, 2 టీ20లు ఆడారు. అంతర్జాతీయ క్రికెట్‌లో అతడు 22 వికెట్లు పడగొట్టారు. 2014 అరంగేట్రం చేసిన కులకర్ణి.. 2016 తర్వాత అవకాశాలు రాలేదు. ఇక 92 ఐపీఎల్ మ్యాచులలో 86 వికెట్స్ తీశారు.

## కుల్దీప్ ముందే చెప్పాడు

నువ్వా నేనా అన్నట్లుగా హోరాహోరీగా సాగిన ఇంగ్లాండ్, ఇండియా టెస్ట్ సిరీస్ ఇటీవల ముగిసింది అన్న విషయం తెలిసిందే ఈ ఐదు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ లో భాగంగా మొదటి మ్యాచ్ లో అటు భారత జట్టు ఓడిపోయినప్పటికీ ఆ తర్వాత నాలుగు మ్యాచ్లలో మాత్రం ఘన విజయాన్ని అందుకుంది టీం ఇండియా.దీంతో 4-1 తేడాతో ఇంగ్లాండ్ ను చిత్తుగా ఓడించి సిరీస్ ను కైవసం చేసుకుంది అని చెప్పాలి. ఇక వరుసగా 17వ టెస్టు సిరీస్ కైవసం చేసుకుని చరిత్ర సృష్టించింది.అయితే ఈ టెస్ట్ సిరీస్లో ఏకంగా వరల్డ్ క్రికెట్లోనే ఎవరికి సాధ్యం కానీ ఒక అరుదైన రికార్డును సృష్టించి సరికొత్త చరిత్ర సృష్టించాడు ఇంగ్లాండు బౌలర్ జేమ్స్ అండర్సన్. ఏకంగా టెస్ట్ ఫార్మాట్లోనే 700 వికెట్లను అందుకున్నాడు అని చెప్పాలీ అయితే సాంప్రదాయమైన టెస్ట్ క్రికెట్లో 700 వికెట్ల మైలురాయిని అందుకోవడం కొత్తేమి కాదు గతంలో ముత్తయ్య మురళీధరన్, షైన్ వార్న్ లాంటి ఆటగాళ్లు ఈ రికార్డులు సాధించారు కానీ ఈ ఇద్దరు స్పిన్నర్లు కావడం గమనార్హం. ఫేసర్లు ఎవరు కూడా ఇప్పుడు వరకు ఈ రికార్డు సాధించలేదు. కానీ అండర్సన్ ఇలాంటి రికార్డు సాధించి చరిత్ర పుటల్లోకి ఎక్కాడు. దీంతో అతని ప్రదర్శన పై అందరూ ప్రశంసలు కురిపించారు అని చెప్పాలి. అయితే ధర్మశాల వేదికగా జరిగిన చివరి టెస్ట్ మ్యాచ్లో అటు భారత స్పిన్నర్ కుల్దీప్ యాదవ్జేమ్స్ అండర్సన్ కి 700వ వికెట్గా మారిపోయాడు అని చెప్పాలి. ఈ క్రమంలోనే ఇదే విషయం గురించి ఇటీవల ఒక ఇంటర్వ్యూలో



జేమ్స్ అండర్సన్ ఆసక్తికర విషయాన్ని చెప్పుకొచ్చాడు. ధర్మశాల వేదికగా జరుగుతున్న టెస్టులో బ్యాటింగ్ చేస్తున్న కుల్దీప్.. నేను నీకు 700 వికెట్ కాబోతున్నాను అని ముందుగానే చెప్పాడు అతను అలా చెప్పిన కొంతసేపటికి నాకు వికెట్ దక్కింది అంటూ ఇటీవల ఇంటర్వ్యూలో అండర్సన్ గుర్తు చేసుకున్నాడు. కుల్దీప్ కు అవుట్ కావాలని లేదు. కాకపోతే తనకు ముందే అవుట్ అయిపోతానేమో అని అనిపించింది అన్న విషయాన్ని తనతో పంచుకున్నాడు అని జేమ్స్ అండర్సన్ తెలిపారు.

## రిషబ్ పంత్ షాకింగ్ కామెంట్స్?



దాదాపు ఏడాదికి పైగానే క్రికెట్కు దూరం గా ఉన్న రిషబ్ పంత్ ఇక గాయాలనుంచి కోల్కొని ప్రస్తుతం పూర్తిస్థాయి కొట్టిన సాధించాడు అన్న విషయం తెలిసింది ఈ క్రమంలోనే మార్చి 22వ తేదీ నుంచి ప్రారంభం కాబోయే ఐపీఎల్ సీజన్లో ఆడి ఆదరకొట్టేందుకు సిద్ధమవుతున్నాడు.గత కొంతకాలం నుంచి రిషబ్ పంత్ రీ ఎంట్రీ కోసం అటు అభిమానులు కూడా వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు అన్న విషయం తెలిసిందే.. అయితే 2022 డిసెంబర్లో రోడ్డు ప్రమాదం బారిన పడ్డాడు రిషబ్ పంత్. ఇక ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ క్రమంలోనే ఈ ప్రమాదం నుంచి కోలుకునేందుకు అతనికి దాదాపు ఏడాదికి పైగా అనే సమయం పడుతుంది. అప్పటినుంచి కూడా పూర్తిగా క్రికెట్కు దూరం అయిపోయాడు రిషబ్ పంత్. అయితే అతను లేకుండానే టీమ్ ఇండియా అని ఫార్మాలలో మ్యాచ్లు ఆడుతూ వచ్చింది. ఇక ఇప్పుడు ఇన్ని నెలల గ్యాప్ తర్వాత మళ్లీ ఐపీఎల్ పునరాగమనం చేయబోతున్నాడు. అయితే ఇక యాక్సిడెంట్ జరిగిన సమయంలో తాను ఎదుర్కొన్న పరిస్థితుల గురించి ఇటీవల ఒక ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చాడు రిషబ్ పంత్.రోడ్డు ప్రమాదం జరిగిన తర్వాత వైద్యులు తన కాలను తీసేస్తారేమో అని అనుకున్నాను అంటూ రిషబ్ పంత్ చెప్పుకొచ్చాడు. యాక్సిడెంట్ అయినప్పుడు ఏదో శక్తి నన్ను కాపాడినట్లు అనిపించింది. ఇంతకు మించిన ఘోర ప్రమాదం నా కలలో కూడా ఊహించలేను నా కాలు తొలగించడం గురించి కూడా డాక్టర్లు నాతో మాట్లాడటం మరింత షాకింగ్ గా అనిపించింది. అయితే కాలు తీసేస్తారు అని అనుకున్నాను. కానీ దేవుని దయవల్ల మళ్లీ కోల్కొని క్రికెట్ ఆడేందుకు సిద్ధమవుతున్నాను అంటూ రిషబ్ పంత్ చెప్పుకొచ్చాడు. ఐపీఎల్ 17వ సీజన్లో రిషబ్ పంత్ ఢిల్లీ జట్టును కెప్టెన్గా ముందుకు నడిపించబోతున్నాడు అన్న విషయం తెలిసిందే.

Edited ,printed,published & Owned by doddamani Basawaraj,printed at vivek Art printers,APHB Shop no2,VidyaNagar Hyderabad-500 044 T.S.
RNI Regd No,TELTEL/2014/56075 Publishd At H.NO.13-6-823/70,Hasim nagar,Langar Houz,Dist.Hyderabad 500 008 T.S Edtor;Doddamani Basawaraj cell no;9490617493